ANN తెలుగు
Follow: @ANNTELUGU
26-09-2026
# మహా పత్రిక
శనివారం, హైదరాబాద్ సంపుటి- 23 సంచిక- 246 పేజీలు-08 వెల-రూ.1
PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/09316 WWW.EPAPER.MAHAADAILY.COM



## ప్రతిష్ఠాత్మక పురస్కారం అందుకున్న సీఎం రేవంత్

- రైతులు, బీసీల సంక్షేమానికి గుర్తింపు
- కేసీ వేణుగోపాల్ చేతులమీదుగా పురస్కారం

**కొచ్చి, మహా :** కేరళలోని నిలంబూర్‌లో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ప్రతిష్ఠాత్మక 'ఆర్యదాన్ ముహమ్మద్ - 2026' బెస్ట్ పబ్లిక్ సర్వెంట్ అవార్డును ఘనంగా అందుకున్నారు. కేరళ కాంగ్రెస్ దిగ్గజ నేత, దివంగత ఆర్యదాన్ ముహమ్మద్ స్మారకార్థం 'ఆర్యదాన్ ముహమ్మద్ ఫౌండేషన్' ఏర్పాటు చేసిన ఈ ప్రతిష్ఠాత్మక పురస్కారాన్ని సీఎం రేవంత్ రెడ్డికి ఫౌండేషన్ ప్రతినిధులు , ఏఐసీసీ ముఖ్య నేతలు సస్కారపూర్వకంగా ప్రదానం చేశారు. ఈ సందర్భంగా రూ. లక్ష నగదు బహుమతి, ప్రశంసాపత్రం , జ్ఞాపికను ముఖ్యమంత్రికి అందజేశారు.

**ప్రజా సంక్షేమ పాలనకు దక్కిన గౌరవం**

తెలంగాణ రాష్ట్రంలో రైతులు, వెనుకబడిన వర్గాలు (బీసీలు) , సామాన్య ప్రజల సంక్షేమం కోసం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేపట్టిన

మిగతా 2వ పేజీలో

టాప్ న్యూస్

## కేంద్ర ఎన్నికల సంఘంలో విభేదాలపై జగన్ ఆందోళన



- అనుమానాలు నివృత్తి చేయాలి

02

## ఎమ్మెల్యే అరికెపూడి గాంధీకి ఈడీ నోటీసులు

- సాహితీ ఇన్‌ఫ్రా కేసులో సమన్లు



02

## 13 నెలల్లోనే గూగుల్ 17 నెలల్లో ఆర్సెలర్

- అహ్మదాబాద్‌లో గుజరాత్ పారిశ్రామికవేత్తలతో మంత్రి లోకేష్ సమావేశం
- ఏపీలో 'స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్'కు ప్రాధాన్యత ఇస్తున్నామని వెల్లడి



02



## ఏపీలో కొత్త మద్యం పాలసీకి సర్వం సిద్ధం

- మిగిలిన 807 దుకాణాలకు అక్టోబర్ 5న లాటరీ
- రూ.3 లక్షల దరఖాస్తు రుసుము

02



# గంగమ్మ ఒడికి గణపయ్య

- భక్తజనసందోహం నడుమ నిమజ్జనం
- ఎటు చూసినా కోలాహలం
- రాష్ట్రవ్యాప్తంగా 1.25లక్షల విగ్రహాల నిమజ్జనం
- ఎప్పటికపుడు పర్యవేక్షించిన డీజీపీ సీవీ ఆనంద్
- ట్యాంక్ బండ్ పై అర్ధరాత్రి దాకా నిమజ్జనాల హోరు



**హైదరాబాద్, మహా:** హైదరాబాద్ లో వినాయక నిమజ్జనం వైభవంగా ప్రశాంతంగా ముగిసింది. తమకు అండగా నిలిచిన ఆర్టీసి మెట్రో పోలీస్ ఇబ్బందిని శభాష్ అంటూ భాగ్యనగరవాసులు ప్రశంసలు కురిపిస్తున్నారు. లక్షలాది మంది జనం ఒకే చోటికి చేరే నిమజ్జన వేడుకల్లో శాంతి భద్రతలను కాపాడటం అత్యంత కఠినమైన టాస్క్ కానీ హైదరాబాద్ పోలీస్ విభాగం అద్భుతమైన ప్రణాళికతో రంగంలోకి దిగింది.

మిగతా 3వ పేజీలో



### రూ.39 లక్షలు పలికిన బాలాపూర్ గణేశుడి లడ్డూ

లక్షలు పలికిన లడ్డూపాటలు



## సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌పై క్రిమినల్ విచారణకు డిమాండ్ సుప్రీంకోర్టులో పిటిషన్

- సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌పై క్రిమినల్ విచారణకు డిమాండ్
- సుప్రీంకోర్టులో పిటిషన్
- ఓటర్ల జాబితా సవరణలో ఏకపక్ష నిర్ణయాలు తీసుకున్నారని ఆరోపణ
- దాదాపు 13 కోట్ల ఓట్లను తొలగించడంపై దర్యాప్తునకు అభ్యర్థన
- ఇతర కమిషనర్ల అసమ్మతిని పట్టించుకోలేదని పిటిషన్‌లో వెల్లడి




**న్యూఢిల్లీ, మహా :** ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్‌పై క్రిమినల్ ప్రాసిక్యూషన్ ప్రారంభించాలని కోరుతూ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలైంది. ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (సర్) ప్రక్రియలో ఆయన తీసుకున్న పలు నిర్ణయాలు చట్టవిరుద్ధమని ఆరోపిస్తూ అడ్వకేట్ శైలేంద్ర మణి త్రిపాఠి ఈ వ్యాజ్యాన్ని దాఖలు చేశారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 32 కింద ఈ ప్రజా ప్రయోజన వ్యాజ్యాన్ని విచారణకు స్వీకరించాలని ఆయన కోరారు. పిటిషన్‌లోని ప్రధాన డిమాండ్ల ప్రకారం, ఇతర ఇద్దరు ఎన్నికల కమిషనర్లు సుఖ్‌బీర్ సింగ్ సంధు, వివేక్ జోషిల అంగీకారం లేకుండా సీఈసీ జ్ఞానేశ్ కుమార్ జారీ చేసిన మార్గదర్శకాలు, ఆదేశాలు, సాఫ్ట్‌వేర్ మార్పులను రాజ్యాంగ విరుద్ధమని ప్రకటించాలి. ఓటరు నమోదుకు ఉపయోగించే ఫారం 6లో చేసిన మార్పులను రద్దు చేసి, పాత విధానాన్ని పునరుద్ధరించాలని కోరారు. దాదాపు 30 రాష్ట్రాలుకేంద్ర పాలిత ప్రాంతాల్లో సుమారు 13 కోట్ల ఓట్లను

మిగతా 2వ పేజీలో



## దీన్‌దయాళ్ సిద్ధాంతమే సమాజ హితానికి మార్గం

- అంత్యోదయమే అభివృద్ధి లక్ష్యం.
- స్వదేశీ భావజాలంతో దేశాభివృద్ధికి ప్రత్యేక దృక్పథం
- ప్రధాని నరేంద్ర మోదీ

**ఢిల్లీ, మహా :** పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ జయంతి సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ ఆయనకు నివాళులర్పించారు. స్వదేశీ భావజాలంతో దేశాభివృద్ధికి ప్రత్యేక దృక్పథాన్ని అందించిన మహనీయుడిగా దీన్‌దయాళ్ ఉపాధ్యాయను కొనియాడారు. ఆయన ప్రతిపాదించిన ఏకాత్మ మానవతావాదం, అంత్యోదయ స్ఫూర్తి తమ

మిగతా 2వ పేజీలో

## ఇరాన్ డ్రోన్ల వెనుక దాగున్న అసలు సూత్రధారి

**అమెరికా నిఘా వర్గాల సంచలన రిపోర్ట్!**

**మహా :** చైనాకు చెందిన శాటిలైట్ డేటా, భౌగోళిక నిఘా సమాచారం కారణంగా ఇరాన్ తన డ్రోన్, క్షిపణి దాడుల ఖచ్చితత్వాన్ని విపరీతంగా పెంచుకుందని అమెరికా నిఘా వర్గాలు వెల్లడించాయి. మిడిల్ ఈస్ట్‌లో ఇరాన్ నిర్వహిస్తున్న దాడులకు చైనా సంస్థలు అందిస్తున్న ఇంటెలిజెన్స్ సహకారమే కీలకమని అంతర్జాతీయ మీడియా నివేదించింది. ముఖ్యంగా జోర్డాన్‌లోని అమెరికా సైనిక స్థావరంపై జరిగిన ప్రాణాంతక దాడిలో ముగ్గురు యూఎస్ సైనికులు మరణించడానికి, ఇరాన్ సొంత సామర్థ్యానికి మించిన



ఈ ఖచ్చితమైన సమాచారమే కారణమని నాలుగు సీనియర్ అధికారిక వర్గాలు ధ్రువీకరించాయి.

## అర్హులైన ఓటర్లకు నోటీసులా?

- సీఈసీ జ్ఞానేశ్ కుమార్ పదవి నుంచి తప్పుకోవాలి
- మహేశ్‌కుమార్ గౌడ్

02



**నిజామాబాద్, మహా :** అర్హులైన ఓటర్లకు కూడా నోటీసులు జారీ చేసి ఇబ్బందులకు గురిచేస్తున్నారని టీపీసీసీ అధ్యక్షుడు బి. మహేశ్‌కుమార్ గౌడ్ ఆరోపించారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియపై కాంగ్రెస్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తోందని తెలిపారు. అర్హత ఉన్న ప్రతి పౌరుడి పేరు ఓటర్ల జాబితాలో ఉండేలా ఎన్నికల సంఘం చర్యలు

మిగితా 2వ పేజీలో

## రాష్ట్రంలో 200 కొత్త కోర్టులు



**హైదరాబాద్, సెప్టెంబర్ 25:** రాష్ట్రంలో న్యాయవ్యవస్థను బలోపేతం చేయడంతో పాటు కేసుల విచారణను వేగవంతం చేసేందుకు తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రవ్యాప్తంగా నూతనంగా 200 అదనపు జూనియర్ సివిల్ జడ్జికమ్అదనపు జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ ఫస్ట్ క్లాస్ కోర్టులను ఏర్పాటు చేయడానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ మేరకు న్యాయ శాఖ కార్యదర్శి బీ. పాపిరెడ్డి ఆర్థిక శాఖ ఆమోదంతో జీవో ఎంఎస్ నంబర్ 59 ను జారీ చేశారు.

## ఆర్టీసీ ఎన్నికల్లో కాంగ్రెస్ మద్దతు ఆ యూనియన్‌కే

- ప్రకటించిన టీపీసీసీ చీఫ్ మహేష్ గౌడ్
- బొంతు రామ్మోహన్‌కు కీలక బాధ్యతలు

02




## గణపతి బప్పా మోరియా

మోతమోగిన ట్యాంక్ బండ్.. సిటీ కొట్టి



04





# ఏపీలో కొత్త మద్యం పాలసీకి సర్వం సిద్ధం

- మిగిలిన 807 దుకాణాలకు అక్టోబర్ 5న లాటరీ.
- రూ.3 లక్షల దరఖాస్తు రుసుము.

**అమరావతి, మహా :** ఆంధ్రప్రదేశ్‌లో 202627 సంవత్సరానికి గాను కొత్త ఎక్సైజ్ పాలసీ అమలుకు రాష్ట్ర ప్రభుత్వం రంగం సిద్ధం చేసింది. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న మొత్తం 3,736 మద్యం దుకాణాల్లో ఇప్పటికే 2,929 దుకాణాల రెన్యూవల్ ప్రక్రియ పూర్తికాగా, మిగిలిన 807 దుకాణాలను లాటరీ విధానం ద్వారా కేటాయించేందుకు ఎక్సైజ్ శాఖ నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ 807 దుకాణాల్లో 799 ఓపెన్ కేటగిరీకి, 8 రిజర్వ్‌డ్ కేటగిరీకి చెందినవి ఉన్నాయి. కొత్త దుకాణాలను దక్కించుకోవాలనుకునే వారు అక్టోబర్ 1వ తేదీలోగా ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ లేదా హైబ్రిడ్ విధానాల్లో తమ దరఖాస్తులను సమర్పించుకోవాల్సి ఉంటుంది. దరఖాస్తుల స్వీకరణ గడువు ముగిసిన అనంతరం అక్టోబర్ 5న పారదర్శకంగా లాటరీ నిర్వహించి అర్హులకు దుకాణాలను కేటాయించనున్నారు.మద్యం దుకాణాల కోసం దరఖాస్తు చేసుకునే వారు నాన్‌రిఫండబుల్ ఫీజు కింద రూ.3 లక్షలు చెల్లించాల్సి ఉంటుంది. ఒకవేళ దరఖాస్తు తిరస్కరించబడినా లేదా లాటరీలో దుకాణం దక్కక పోయినా ఈ మొత్తాన్ని తిరిగి చెల్లించే ప్రసక్తే ఉండదని ప్రభుత్వం నిబంధనల్లో స్పష్టం చేసింది. ఈ కొత్త లైసెన్సుల గడువు ఈ ఏడాది అక్టోబర్ 1 నుంచి వచ్చే ఏడాది సెప్టెంబర్ 30 వరకు ఏడాది పాటు అమల్లో ఉండనుంది. లాటరీ జరగనున్న జిల్లాల వారీ లెక్కలను పరిశీలిస్తే అత్యధికంగా వైఎస్‌ఆర్ కడప జిల్లాలో 60 దుకాణాలకు లాటరీ నిర్వహించనున్నారు. ఆ తర్వాతి స్థానాల్లో అనంతపురం (53), విశాఖపట్నం (52), నెల్లూరు (51) జిల్లాలు ఉన్నాయి. తిరిగి రాని రూ.3 లక్షల రుసుము ఉన్నప్పటికీ ప్రధాన వ్యాపార కేంద్రాలు, జనాభా అధికంగా ఉన్న ప్రాంతాల్లోని దుకాణాల కోసం తీవ్ర పోటీ నెలకొనే అవకాశం ఉంది.మొత్తం మద్యం దుకాణాల వ్యవస్థలో గీత కార్మికులకు ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం కల్పించింది. రాష్ట్రంలోని 3,736 దుకాణాల్లో 3,396 దుకాణాలను ఓపెన్ కేటగిరీలో ఉంచగా, కల్లు ఉత్పత్తి, విక్రయ కార్యకలాపాలపై ఆధారపడిన గీత కార్మికుల ఆర్థిక ప్రయోజనాల కోసం 340 దుకాణాలను ప్రత్యేకంగా రిజర్వ్ చేసింది. రాష్ట్ర ప్రభుత్వ ఆదాయంలో ఎక్సైజ్ శాఖ కీలక పాత్ర పోషిస్తున్న నేపథ్యంలో, లాటరీ ప్రక్రియను త్వరితగతిన ముగించి కొత్త పాలసీని పూర్తిస్థాయిలో పట్టాలెక్కించేందుకు అధికారులు ముమ్మర ఏర్పాట్లు చేస్తున్నారు. అక్టోబర్ 5న లాటరీ పూర్తయిన వెంటనే కొత్త లైసెన్సుదారులు తమ కార్యకలాపాలను ప్రారంభించేందుకు వీలు కలుగుతుంది.

# ఆర్టీసీ ఎన్నికల్లో కాంగ్రెస్ మద్దతు ఆ యూనియన్‌కే

- ప్రకటించిన టీపీసీసీ చీఫ్ మహేష్ గౌడ్
- బొంతు రామ్మోహన్‌కు కీలక బాధ్యతలు

**హైదరాబాద్, మహా :** తెలంగాణ ఆర్టీసీలో గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికల వేడి మొదలైంది. దాదాపు 8 ఏళ్ల విరామం తర్వాత జరుగుతున్న ఈ ఎన్నికలకు అక్టోబర్ 9వ తేదీన పోలింగ్ నిర్వహించనుండగా.. ఇప్పటికే పలు కార్మిక సంఘాలు ప్రచారాన్ని ముమ్మరం చేశాయి. ఈ క్రమంలో అధికార కాంగ్రెస్ పార్టీ తన మద్దతును ఒక యూనియన్‌కు ప్రకటించడం చర్చనీయాంశంగా మారింది. తెలంగాణ ఆర్టీసీ వర్కర్స్ యూనియన్ (టీడబ్ల్యూయూ)కు పార్టీ తరఫున పూర్తి మద్దతు ఇస్తున్నట్లు టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేశ్ కుమార్ గౌడ్ ప్రకటించారు. ఆర్టీసీ గుర్తింపు సంఘం ఎన్నికల్లో టీడబ్ల్యూయూకు కాంగ్రెస్ పార్టీ మద్దతు ఉంటుందని మహేశ్ కుమార్ గౌడ్ వెల్లడించారు. ఈ విషయాన్ని పార్టీ నాయకులు, ఎమ్మెల్యేలు, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులకు తెలియజేసినట్లు తెలుస్తోంది. తమ నియోజకవర్గాల పరిధిలోని ఆర్టీసీ డిపోల్లో టీడబ్ల్యూయూకు సహకారం, సమన్వయం అందించాలని పార్టీ శ్రేణులకు సూచించినట్లు సమాచారం. మహేశ్ కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో జరిగిన ఎన్నికల సన్నాహక సమావేశంలో కాంగ్రెస్ నేతలు, టీడబ్ల్యూయూ ప్రతినిధులు పాల్గొన్నారు. కార్మికుల సమస్యలు, పని పరిస్థితులు, పెండింగ్ అంశాలు, ఆర్టీసీ భవిష్యత్ తదితర అంశాలపై చర్చ జరిగినట్లు సమాచారం. టీడబ్ల్యూయూ విజయం కోసం క్షేత్ర స్థాయిలో సమన్వయంతో పనిచేయాలని పార్టీ శ్రేణులకు సూచించారు. ఆర్టీసీ ఎన్నికలకు సంబంధించి కాంగ్రెస్ పార్టీ మరో కీలక నిర్ణయం తీసుకుంది. టీపీసీసీ ఉపాధ్యక్షుడు, జీహెచ్‌ఎంసీ మాజీ మేయర్ బొంతు రామ్మోహన్‌ను పార్టీ ఎన్నికల సమన్వయకర్తగా నియమించింది. రాష్ట్రవ్యాప్తంగా పార్టీ నేతలు, కార్మిక సంఘం ప్రతినిధుల మధ్య సమన్వయం చూసే బాధ్యతను బొంతు రామ్మోహన్‌కు అప్పగించింది. డిపోల వారీగా పార్టీ నాయకులు, కార్మిక సంఘం ప్రతినిధులతో సమన్వయం చేసుకుంటూ ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించేందుకు కాంగ్రెస్ పార్టీ వ్యూహం సిద్ధం చేసుకుంటోంది. అయితే ఎన్నికల్లో తుది నిర్ణయం ఆర్టీసీ కార్మికుల ఓట్ల ద్వారానే వెలువడనుంది. తెలంగాణ ఆర్టీసీ గుర్తింపు సంఘం ఎన్నికల షెడ్యూల్‌ను కార్మిక శాఖ ఈనెల 18వ తేదీన విడుదల చేసింది. షెడ్యూల్ ప్రకారం అక్టోబర్ 9వ తేదీన ఉదయం 5 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్ జరగనుంది. రహస్య బ్యాలెట్ విధానంలో ఎన్నికలు నిర్వహిస్తారు. పోస్టల్ బ్యాలెట్ కోసం అక్టోబర్ 14, 15వ తేదీలను కేటాయించారు. అక్టోబర్ 17వ తేదీన ఫలితాలను ప్రకటించనున్నారు.

# సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌పై క్రిమినల్ విచారణకు డిమాండ్ సుప్రీంకోర్టులో పిటిషన్

( మొదటి పేజీత తరువాయి )

తొలగించారన్న ఆరోపణలపై ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) లేదా సుప్రీంకోర్టు రిటైర్డ్ న్యాయమూర్తితో విచారణ జరిపించాలని పిటిషన్‌లో అభ్యర్థించారు.సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌తో పాటు సీనియర్ డిప్యూటీ ఎలక్షన్ కమిషనర్ మనీశ్ గార్గ్, ఈసీ ఐటీ విభాగం అధిపతి సీమా ఖన్నా తదితరులపై ప్రజాప్రాతినిధ్య చట్టం1950లోని సెక్షన్ 32 కింద క్రిమినల్ చర్యలు తీసుకోవాలని పిటిషనర్ డిమాండ్ చేశారు. గత 10 నెలల్లో ఎన్నికల కమిషన్‌లోని ఇతర ఇద్దరు కమిషనర్లు దాదాపు 14 సందర్భాల్లో పలు కీలక నిర్ణయాలపై లిఖితపూర్వకంగా తమ అసమ్మతిని వ్యక్తం చేశారని వెలువడిన మీడియా కథనాలను పిటిషన్‌లో ఉటంకించారు. ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో అక్రమాలు జరిగాయని, అధికార పార్టీకి లబ్ధి చేకూర్చేలా భారీ సంఖ్యలో ఓటర్లను తొలగించారని కాంగ్రెస్ సహా ప్రతిపక్షాలు గతంలోనే ఆరోపించాయి. అయితే, కమిషనర్ల మధ్య అభిప్రాయ భేదాలు సహజమేని, తుది నిర్ణయాలు మాత్రం ఏకాభిప్రాయంతోనే తీసుకున్నామని ఎన్నికల కమిషన్ గతంలో వివరణ ఇచ్చింది. ప్రస్తుతం ఈ పిటిషన్ దాఖలు దశలో ఉండగా, సుప్రీంకోర్టు దీనిపై ఇకా విచారణ చేపట్టాల్సి ఉంది.



# అర్హులైన ఓటర్లకు నోటీసులా?

(మొదటి పేజీ తరువాయి)

తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

**పలుమార్లు ఓటేసిన వారికీ నోటీసులా?**

దేశంలో పుట్టి, గత ఎన్నికల్లో పలుమార్లు ఓటు వేసిన పౌరులకు కూడా నోటీసులు ఇస్తూ ఇబ్బందులకు గురిచేస్తున్నారని మహేశ్‌కుమార్ గౌడ్ విమర్శించారు. ఓటర్ల జాబితా సవరణ పేరుతో అర్హులైన వారి పేర్లు తొలగించకూడదని అన్నారు. ప్రతి అర్హుడికి ఓటు హక్కు ఉండేలా చూడాల్సిన బాధ్యత ఎన్నికల సంఘంపై ఉందని పేర్కొన్నారు.

**జ్ఞానేశ్‌కుమార్ తప్పుకోవాలి**

ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్‌కుమార్ పదవి నుంచి తప్పుకోవాలని మహేశ్‌కుమార్ గౌడ్ డిమాండ్ చేశారు. రాహుల్‌గాంధీ, ప్రియాంకాగాంధీ ఇప్పటికే ఎన్నికల సంఘం తీరుపై ప్రశ్నలు లేవనెత్తారని తెలిపారు. జ్ఞానేశ్‌కుమార్ రాజీనామా చేయాలని కాంగ్రెస్ దేశవ్యాప్తంగా నిరసనలకు పిలుపునిచ్చిన నేపథ్యంలో మహేశ్‌కుమార్ గౌడ్ వ్యాఖ్యలు చేశారు.



**ఎస్ఐఆర్‌పై కాంగ్రెస్ అభ్యంతరాలు**

ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో పేర్ల తొలగింపు, నోటీసులు, అభ్యంతరాల పరిష్కారంపై కాంగ్రెస్ ప్రశ్నలు లేవనెత్తుతోంది. తెలంగాణలో ఈ ప్రక్రియపై పారదర్శకత కోసం నియోజకవర్గాల వారీగా తొలగించిన ఓటర్ల వివరాలు, కారణాలు, వచ్చిన అభ్యంతరాలు, వాటిపై తీసుకున్న నిర్ణయాలను బహిర్గతం చేయాలని టీపీసీసీ డిమాండ్ చేసింది.

**ఎన్నికల సంఘం వివరణ**

అయితే ఎస్ఐఆర్‌కు సంబంధించిన నిర్ణయాలన్నీ ఎన్నికల సంఘంలోని ముగ్గురు కమిషనర్లు ఏకగ్రీవంగా తీసుకున్నాయని ఎన్నికల సంఘం ఇప్పటికే స్పష్టం చేసింది. ఇదే సమయంలో ఇద్దరు ఎన్నికల కమిషనర్లు పలు నిర్ణయాలపై అభ్యంతరాలు వ్యక్తం చేసినట్లు వచ్చిన వార్తల నేపథ్యంలో కాంగ్రెస్ సీఈసీపై విమర్శలు కొనసాగిస్తోంది.

**గణనాథుడి నిమజ్జనంలో మహేశ్‌గౌడ్**

నిజామాబాద్‌లో గణేశ్ నిమజ్జన వేడుకల్లో పాల్గొన్న మహేశ్‌కుమార్ గౌడ్.. గణనాథుడిని ఘనంగా సాగనంపుతూ రాష్ట్రం వ్యవసాయం, విద్య, వైద్యం సహా అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని కోరుకున్నట్లు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందాలని ఆకాంక్షించారు. ప్రజల ఆశీర్వాదం కాంగ్రెస్‌కు కొనసాగాలని కోరుకున్నట్లు చెప్పారు.



# రూ.39 లక్షలు పలికిన బాలాపూర్ గణేశుడి లడ్డూ

**లక్షలు పలికిన లడ్డూపాటలు**

**హైదరాబాద్, మహా :** బాలాపూర్ గణేశుడి లడ్డూ వేలం పాట ముగిసింది. ఏటేటా భక్తుల్లో అంచనాలను పెంచుతూ దేశ విదేశాల్లోని తెలుగువారిని ఆకర్షించే ఈ లడ్డూ వేలం పాట, ఈ ఏడాది మరింత రసవత్తరంగా సాగింది. ఈసారి నిర్వహించిన వేలంలో రికార్డు స్థాయిలో రూ.39 లక్షలు పలికింది. బాలాపూర్ లడ్డూను వనస్థలిపురానికి చెందిన సామ ప్రణీత్‌రెడ్డి దక్కించుకున్నారు. బాలాపూర్ లడ్డూకు పోటీ కాకపోయినా నగరంలో పలుచోట్ల వేలం పాటల్లో లక్షల్లోనే సాగాయి. హస్తినాపురంలోని అగ్రికల్చర్ కాలనీలో గణేశ్ లడ్డును భక్తుడు శివనాగేశ్వరరావు రూ.16.02 లక్షలకు దక్కించుకున్నాడు. అత్తాపూర్‌లో నవశక్తి భక్త సమాజ్ మండపం గణేశ్ లడ్డూ రూ.13.21 లక్షలు పలికింది. మూసాపేట సేవాలాల్‌నగర్‌లో రూ.11.50 లక్షలకు పాడారు. రంగారెడ్డి జిల్లా బడంగ్‌పేటలో గణేశ్ లడ్డూప్రసాదం వేలంలో రూ.10.50 లక్షలు పలికింది. ఆర్‌వీఆర్ క్లాడ్స్ కిచెన్ అండ్ క్యాటరర్స్ సంస్థ లడ్డూను దక్కించుకుంది. హైదరాబాద్ హస్తినాపురంలోని అగ్రికల్చర్ కాలనీలో గణేశ్ లడ్డు రూ.16.02 లక్షలు పలికింది. శివనాగేశ్వరరావు ఈ లడ్డూను దక్కించుకున్నారు. అత్తాపూర్‌లో వినాయకుడి లడ్డూ ధర రూ.13.21 లక్షలు పలికింది. నవశక్తి భక్త సమాజ్ లడ్డూ వేలం నిర్వహించగా, గుమ్మడి భూపాల్‌రెడ్డి దక్కించుకున్నారు. మూసాపేట సేవాలాల్‌నగర్‌లో రూ.11.50 లక్షలకు శంకర్‌నాయక్ లడ్డూ ప్రసాదం దక్కించుకున్నారు.

## 13 నెలల్లోనే గూగుల్

# 17 నెలల్లో ఆర్సెలర్

- అహ్మదాబాద్‌లో గుజరాత్ పారిశ్రామికవేత్తలతో మంత్రి లోకేష్ సమావేశం
- ఏపీలో 'స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్'కు ప్రాధాన్యత ఇస్తున్నామని వెల్లడి



**అహ్మదాబాద్, మహా :** 2047 నాటికి వికసిత్ భారత్ నిర్మాణంలో ఆంధ్రప్రదేశ్ ప్రధాన గ్రోత్ ఇంజన్‌గా నిలవాలని, ఈ అభివృద్ధి ప్రయాణంలో పెట్టుబడిదారులు భాగస్వాములు కావాలని రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ పిలుపునిచ్చారు. అహ్మదాబాద్‌లో సీఐఐ (కాన్ఫడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ) ఆధ్వర్యంలో జరిగిన పార్ట్‌నర్‌షిప్ సమ్మిట్ రోడ్‌షోలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. గుజరాత్ పారిశ్రామిక స్ఫూర్తి దేశానికి ఆదర్శమని, ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో ఆ రాష్ట్రం సాధించిన ప్రగతి అద్భుతమని కొనియాడారు. వైబ్రంట్ గుజరాత్ మోడల్ స్ఫూర్తితో ఏపీ కూడా శరవేగంగా దూసుకెళ్తోందని, ఈ ప్రగతిలో గుజరాత్ పారిశ్రామిక రంగం భాగస్వామి కావాలని ఆయన కోరారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దార్శనికతతో, వేగవంతమైన నిర్ణయాలతో రాష్ట్రాన్ని ముందుకు నడిపిస్తున్నారని లోకేశ్ తెలిపారు. తమ ప్రభుత్వ పనితీరుకు ఫలితాలే నిదర్శనమని, 2025 26 ఆర్థిక సంవత్సరం తొలి తొమ్మిది నెలల్లో దేశానికి వచ్చిన మొత్తం పెట్టుబడుల్లో 25.3 శాతం ఏపీకే వచ్చాయని గుర్తుచేశారు. ఏపీలో 'స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్'కు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామని, మాటలకే పరిమితం కాకుండా చేతల్లో వేగం చూపిస్తున్నామని వివరించారు. గుజరాత్‌లో డబుల్ ఇంజన్ సర్కార్ ఉంటే, ఏపీలో కేంద్రం సహకారంతో 'నాయుడుమోదీ జీ' జోడీతో డబుల్ ఇంజన్ బుల్లెట్ ట్రైన్ సర్కార్ ఉందని వ్యాఖ్యానించారు. ప్రభుత్వ వేగానికి ఉదాహరణగా గూగుల్, ఆర్సెలార్ మిట్టల్ ప్రాజెక్టులను లోకేశ్ ప్రస్తావించారు. విశాఖలో గూగుల్ ఏఐ హబ్, డేటా సెంటర్ ఏర్పాటుకు సంబంధించిన ప్రక్రియను కేవలం 13 నెలల్లో పూర్తి చేశామని తెలిపారు. అదేవిధంగా, సుమారు 12 బిలియన్ డాలర్ల పెట్టుబడితో రానున్న ఆర్సెలర్ మిట్టల్ గ్రీన్‌ఫీల్డ్ స్టీల్ ప్లాంట్‌కు సంబంధించిన భూసేకరణ, పర్యావరణ అనుమతులు, పునరావాసం వంటి క్లిష్టమైన ప్రక్రియలను కేవలం 17 నెలల్లో పూర్తి చేశామని వివరించారు. పెట్టుబడిదారుల సమస్యలను వ్యక్తిగత సమస్యగా కాకుండా, వ్యవస్థాగత సమస్యగా చూసి శాశ్వత పరిష్కారాలు చూపుతామని భరోసా ఇచ్చారు. అందుకే కొందరు తనను సరదాగా 'ఆంధ్రా డోలో650' అని పిలుస్తారని అన్నారు. పెట్టుబడిదారులను కేవలం అనుమతుల కోసం వచ్చేవారిగా కాకుండా రాష్ట్ర అభివృద్ధిలో దీర్ఘకాలిక భాగస్వాములుగా చూస్తామని లోకేశ్ స్పష్టం చేశారు. 'స్పీడ్, స్టెబిలిటీ, సర్వీస్' అనే మూడు సూత్రాలతో ముందుకెళ్తున్నామన్నారు. రాష్ట్రంలో క్లస్టర్ ఆధారిత అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తున్నామని, ఎలక్ట్రానిక్స్, ఆటోమోటివ్, గ్రీన్ ఎనర్జీ, ఫార్మా వంటి 23 రంగాల్లో ప్రత్యేక క్లస్టర్లను అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. విశాఖ, అమరావతి, తిరుపతిలను ప్రత్యేక ఆర్థిక రీజియన్లుగా తీర్చిదిద్దుతామని, హైదరాబాద్‌ను అభివృద్ధి చేసిన అనుభవంతో అమరావతిని కూడా ఉన్నతంగా నిర్మిస్తామని చంద్రబాబు పట్టుదలతో ఉన్నారని అన్నారు.గుజరాత్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలు పోటీపడాల్సిన అవసరం లేదని, కలిసి పనిచేస్తే అద్భుతాలు సృష్టించవచ్చని అభిప్రాయపడ్డారు. ఏపీని తూర్పు భారతదేశానికి వ్యూహాత్మక గేట్‌వేగా వినియోగించుకోవాలని గుజరాత్ పారిశ్రామికవేత్తలను కోరారు. నవంబర్‌లో జరగనున్న పార్ట్‌నర్‌షిప్ సమ్మిట్‌లో పాల్గొనాలని ఆహ్వానిస్తూ, 2047 నాటికి ఏపీ ఆర్థిక వ్యవస్థను 2.4 ట్రిలియన్ డాలర్లకు చేర్చడమే తమ లక్ష్యమని పునరుద్ఘాటించారు. ఈ కార్యక్రమంలో సీఐఐ గుజరాత్ ప్రతినిధులు, ఏపీఐఐసీ ఉన్నతాధికారులు, పలువురు పారిశ్రామికవేత్తలు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే అరికెపూడి గాంధీకి ఈడీ నోటీసులు

**సాహితీ ఇన్‌ఫ్రా కేసులో సమన్లు**

**హైదరాబాద్, మహా :** ఎమ్మెల్యే అరికెపూడి గాంధీకి ఈడీ సమన్లు జారీ చేసింది. సాహితి ఇన్‌ఫ్రాటెక్ వెంచర్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్‌కు సంబంధించిన మనీలాండరింగ్ కేసులో విచారణకు హాజరుకావాలని ఆదేశించింది. సాహితి ఇన్‌ఫ్రా నుంచి అరికెపూడి గాంధీకి సంబంధించిన బ్యాంకు అకౌంట్లలోకి సుమారు రూ.2.1 కోట్ల నిధులు బదిలీ అయినట్లు దర్యాప్తులో ఈడీ గుర్తించింది. ఈ లావాదేవీల స్వభావం, ఉద్దేశం, వాటికి చట్టబద్ధమైన వ్యాపార కారణాలు ఉన్నాయా అనే అంశాలను అధికారులు పరిశీలిస్తున్నారు.



# ప్రతిష్టాత్మక పురస్కారం అందుకున్న సీఎం రేవంత్

(మొదటి పేజీ తరువాయి )

వినూత్న పథకాలు, ఆయన కనబరుస్తున్న దూరదృష్టి గల పరిపాలనా వైఖరికి గుర్తింపుగా ఈ పురస్కారాన్ని అందించారు. ప్రజాస్వామిక విలువల పట్ల రేవంత్ రెడ్డికి ఉన్న నిబద్ధతను, సమర్థవంతమైన నాయకత్వాన్ని అవార్డు ఎంపిక జ్యూరీ సభ్యులైన ఎంపీ బెన్నీ బెహనన్, కేరళ మంత్రి ఎ.పి. అనిల్‌కుమార్ , ప్రముఖ మేధావి కల్పేట్టా నారాయణన్ ప్రత్యేకంగా కొనియాడారు.

**కార్యక్రమంలో పాల్గొన్న ఏఐసీసీ కీలక నేతలు**

దివంగత ఆర్యదాన్ ముహమ్మద్ నాలుగో వర్ధంతిని పురస్కరించుకుని నిర్వహించిన ఈ ప్రదానోత్సవ వేడుకలో ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి (సంస్థాగత) కె.సి. వేణుగోపాల్ ముఖ్య అతిథిగా హాజరై స్మారక ఉపన్యాసం చేశారు. ఎనిమిది సార్లు ఎమ్మెల్యేగా, నాలుగు సార్లు మంత్రిగా సేవలు అందించి కేరళ ప్రజల గుండెల్లో చెరగని ముద్ర వేసుకున్న ఆర్యదాన్ ముహమ్మద్ పేరిట నెలకొల్పిన తొలి ప్రతిష్టాత్మక పురస్కారాన్ని తెలంగాణ ముఖ్యమంత్రి స్వీకరించడం పట్ల పలువురు రాజకీయ ప్రముఖులు, నేతలు అభినందనలు తెలిపారు.



# దీన్‌దయాళ్ సిద్ధాంతమే సమాజ హితానికి మార్గం

- అంత్యోదయమే అభివృద్ధి లక్ష్యం.
- స్వదేశీ భావజాలంతో దేశాభివృద్ధికి ప్రత్యేక దృక్పథం
- ప్రధాని నరేంద్ర మోదీ

( మొదటి పేజీ తరువాయి )

విధానాలకు మార్గదర్శకమని పేర్కొన్నారు.

**సమాజ హితంతో వ్యక్తి ప్రగతి**

వ్యక్తి అభివృద్ధి సమాజ హితం నుంచి వేరుగా ఉండకూడదన్నదే దీన్‌దయాళ్ ఉపాధ్యాయ సిద్ధాంత సారమని మోదీ అన్నారు. వ్యక్తి ఎదుగుదలతో పాటు సమాజం, దేశం, ప్రకృతి మధ్య సమతుల్యత కొనసాగాలని ఆయన భావించారని వివరించారు.

**చివరి వ్యక్తి వరకు అభివృద్ధి**

అభివృద్ధి ఫలాలు సమాజంలోని చివరి వ్యక్తికి కూడా చేరాలన్నదే అంత్యోదయ లక్ష్యమని ప్రధాని పేర్కొన్నారు. పేదలు, అట్టడుగు వర్గాలకు అభివృద్ధి అవకాశాలు అందించడం ద్వారా సమగ్ర ప్రగతిని సాధించాలన్నది దీన్‌దయాళ్ ఆలోచనల్లో ప్రధాన అంశమని తెలిపారు.

**ప్రకృతి పరిరక్షణతో అభివృద్ధి**

కేవలం ఆర్థిక వృద్ధినే అభివృద్ధిగా చూడకూడదని మోదీ అన్నారు. సామాజిక సంక్షేమంతో పాటు పర్యావరణ పరిరక్షణకు కూడా ప్రాధాన్యం ఉండాలని దీన్‌దయాళ్ ఉపాధ్యాయ సూచించారని గుర్తుచేశారు. ప్రకృతికి హాని కలగకుండా సమాజం పురోగమించే అభివృద్ధి నమూనా అవసరమని పేర్కొన్నారు.

**సమగ్ర భారత నిర్మాణం**

పేదల సంక్షేమం, అట్టడుగు వర్గాల సాధికారత, పర్యావరణ సమతుల్యతకు ప్రాధాన్యమిస్తూ తమ ప్రభుత్వం నిర్ణయాలు తీసుకుంటోందని మోదీ తెలిపారు. దీన్‌దయాళ్ ఉపాధ్యాయ ఆలోచనల స్ఫూర్తితో సమగ్ర, అభివృద్ధి చెందిన భారతదేశ నిర్మాణం దిశగా ముందుకు సాగుతున్నామని చెప్పారు.

# కేంద్ర ఎన్నికల సంఘంలో విభేదాలపై జగన్ ఆందోళన

**అనుమానాలు నివృత్తి చేయాలి**

**తాడేపల్లి, మహా :** కేంద్ర ఎన్నికల సంఘంలో విభేదాలపై వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు,మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. కమిషనర్ల మధ్య అభిప్రాయ బేధాలు తలెత్తటంపై ఎక్స్‌లో వైఎస్ జగన్ పోస్టు చేశారు. "ఎన్నికల సంఘం వంటి రాజ్యాంగ సంస్థలపై ప్రజలకు సంపూర్ణ విశ్వాసం ఉండాలి.. అప్పుడే ప్రజాస్వామ్యం బలంగా నిలబడుతుంది. ఎన్నికల సంఘంలోనే ఇద్దరు ఎన్నికల కమిషనర్ల మధ్య అభిప్రాయ భేదాలు అనే వార్తలు ఆందోళన కలిగిస్తున్నాయి" అని వైఎస్ జగన్ ట్వీట్ చేశారు. ముఖ్యంగా ఓటర్ల జాబితాల నిర్వహణ సహా అనేక అంశాల్లో బేధాభిప్రాయాలు వచ్చినట్టు జాతీయ మీడియాలో కథనాలు వచ్చాయి. ఇవి ప్రజల్లో అనేక ప్రశ్నలకు దారి తీశాయి. ఆ మీడియా కథనాల ప్రకారం గత పది నెలల్లోనే 14సందర్భాల్లో అభ్యంతరాలు వ్యక్తం అయ్యాయి. అయితే ఎన్నికల సంఘం మాత్రం ఇవన్నీ సహజమే అంటోంది. బేధాభిప్రాయాలు ఉన్నా తుది నిర్ణయాలు ఏకగ్రీవంగానే తీసుకున్నామని చెప్తోంది. కానీ ప్రజల్లో నెలకొన్న సందేహాలను ఎన్నికల సంఘం నివృత్తి చేయాలి. .ఆరోపణలు-ప్రత్యారోపణలకు పరిమితం కాకుండా ఏయే అంశాలపై అభ్యంతరాలు నమోదయ్యాయి?. వాటిపై ఏ చర్యలు తీసుకున్నారో ప్రజలకు తెలియాలి. ఓటర్ల జాబితాలో పేర్ల చేర్పులు, తొలగింపులు, పునరుద్ధరణ ప్రక్రియ ఎంత పారదర్శకంగా జరిగింది?. ఓటర్ల జాబితాల నిర్వహణలో క్షేత్రస్థాయి అధికారులకు ఎంత స్వతంత్రత ఉంది?. అనే అంశాలపై స్పష్టత అవసరం. ప్రతి పౌరుడి ఓటు హక్కును పరిరక్షించడం, ఎన్నికల ప్రక్రియపై ప్రజలకు నమ్మకాన్ని కలిగించటం అత్యంత ముఖ్యం. ప్రజాస్వామ్యంలో పారదర్శకత ఉండటమే కాదు. పారదర్శకత ఉందనే నమ్మకం కూడా ప్రజలకు కలగాలి. 2023లో తీసుకొచ్చిన నూతన చట్టానికి మేము మద్దతు ఇచ్చాం. కానీ ప్రస్తుత పరిస్థితుల నేపథ్యంలో ఆ చట్టాన్ని మరోసారి సమీక్షించాల్సిన అవసరం ఉంది. ఎన్నికల సంఘంపై ఎలాంటి అనుమానాలకు తావులేకుండా చూడాలి. ప్రజల్లో విశ్వాసాన్ని పెంచే వ్యవస్థను ఏర్పాటు చేయాలి. ఎన్నికల కమిషనర్ల నియామకానికి ప్రధానమంత్రి, సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి, లోక్‌సభ ప్రతిపక్ష నేత సభ్యులుగా ఉండే ముగ్గురు సభ్యుల కమిటీ విధానాన్ని తిరిగి తీసుకురావాలి. ఆ మేరకు చట్ట సవరణపై ఆలోచించాలి. విద్యార్థే పరీక్ష పెట్టే వారిని నియమించే పరిస్థితి ఉంటే.. ఆ వ్యక్తి ఎంత నిజాయితీపరుడైనా అనుమానాలకు తావిస్తుంది. అందుకే నియామకాలు పారదర్శకంగా ఉండేలా వ్యవస్థ ఉండాలి



# మిడ్ మానేరు నిర్వాసితులకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలి: చెన్నమనేని వికాస్

- **5.04 లక్షల పరిహారం వెంటనే చెల్లించాలి: బీజేపీ డిమాండ్**
- **సీఎం రేవంత్ రెడ్డి పర్యటన వేళ ముంపు బాధితుల సమస్యలు పరిష్కరించాలి**
- **మిడ్ మానేరు నిర్వాసితుల ఇందిరమ్మ ఇళ్లపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలి**

**వేములవాడ,మహా:** మిడ్ మానేరు ముంపు గ్రామాల నిర్వాసితులకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ చెన్నమనేని వికాస్ డిమాండ్ చేశారు. ఈనెల 30న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సిరిసిల్ల పర్యటనకు వస్తున్న నేపథ్యంలో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి మిడ్ మానేరు ముంపు గ్రామ నిర్వాసిత కుటుంబానికి రూ.5,04,000 పరిహారాన్ని వెంటనే మంజూరు చేయాలని కోరారు. ఎన్నికల ముందు ఇచ్చిన ఉపాధి కల్పన హామీతో పాటు నిర్వాసితుల పెండింగ్ సమస్యలన్నింటినీ తక్షణమే పరిష్కరించాలన్నారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద ఎంతమంది నిర్వాసితులకు ఇళ్లు మంజూరు చేశారు, ఎంతమంది నిర్మించుకున్నారనే వివరాలను ప్రభుత్వం స్పష్టంగా వెల్లడించాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే బ్యాంకులు, ఇతర చోట్ల అప్పులు చేసి ఇళ్లు నిర్మించుకున్న నిర్వాసితులను ఆదుకోవాలన్నారు. మూడేళ్లు గడిచినా సమస్యలు పెండింగ్‌లోనే ఉన్నాయని, ప్రకటనలకే పరిమితం కాకుండా ప్రభుత్వం స్పష్టమైన కార్యాచరణ ప్రకటించి నిర్వాసితులకు న్యాయం చేయాలని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో వేములవాడ మండల అధ్యక్షుడు బుర్ర శేఖర్, జిల్లా ప్రధాన కార్యదర్శి సిరికొండ శ్రీనివాస్, సీనియర్ నాయకులు లింగంపల్లి శంకర్, జింక అనిల్, సురువు వెంకట్, మండల ప్రధాన కార్యదర్శులు చంద్రగిరి ప్రశాంత్, గుండెకార్ల లక్ష్మణ్, మండల ఉపాధ్యక్షుడు ఎరుగొక్కుల రమేష్, ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు రేగుల సంతోష్ బాబు, జిల్లా కౌన్సిల్ మెంబర్ జక్కుల తిరుపతి, ఇతర మండలాల అధ్యక్షులు, ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.




# ఎంబీబీఎస్ సీటు సాధించిన గాజుల పద్మావతికి ఘన సన్మానం

**మందమర్రి, మహా:** మందమర్రి పట్టణానికి చెందిన గాజుల పద్మావతి ఎంబీబీఎస్ సీటు సాధించడం పట్ల స్థానిక పట్టణ మరియు గ్రామీణ ఆర్.ఎం.పి, పి.ఎం.పి అనుభవ వైద్యుల సంఘం హర్షం వ్యక్తం చేసింది. శుక్రవారం ఆమెను నీట్ పరీక్షలో ఉత్తమ ర్యాంకు సాధించి ఎంబీబీఎస్ సీటు పొందిన సందర్భంగా సంఘం నాయకులు ఆమెను అభినందించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఆమెకు ప్రత్యేకంగా అభినందన పత్రాన్ని అందజేసి, శాలువాతో ఘనంగా సత్కరించారు.ఈ సందర్భంగా సంఘం నాయకులు మాట్లాడుతూ ఆర్.ఎం.పి, పి.ఎం.పి కుటుంబాల నుంచి కూడా విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించి వైద్య వృత్తిలోకి రావాలని ఆకాంక్షించారు. కష్టపడి చదివి పద్మావతి సాధించిన ఈ విజయం తోటి విద్యార్థులందరికీ స్ఫూర్తిదాయకమని కొనియాడారు. భవిష్యత్తులో ఆమె మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించి, సమాజానికి ఉత్తమ సేవలు అందించాలని ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో సంఘం పట్టణ అధ్యక్షులు గోనే గోవర్ధన్, ప్రధాన కార్యదర్శి అడ్డూరి సాంబమూర్తి, గౌరవ అధ్యక్షులు కట్ల శ్రీనివాస్, వర్కింగ్ ప్రెసిడెంట్ మంద తిరుమల రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి గాదాసు శంకరయ్య, అలాగే గోనే శ్రీనివాస్, గోనే సత్యం, వేముల నరసయ్య, అయిల్లా లక్ష్మణ్, తిప్పని శ్రీనివాస్, నర్సింగ్ రోజు తిరుపతి, రాయమల్లు, మల్లేష్ తదితర వైద్య మిత్రులు పాల్గొన్నారు.



# అమృత్ 2.0 పనులను వేగవంతం చేయాలి

**మంచిర్యాల జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) చంద్రయ్య**

**మంచిర్యాల, మహా** :ప్రజలకు నిరంతరం శుద్ధమైన త్రాగునీటిని అందించే లక్ష్యంతో చేపట్టిన అమృత్ 2.0 పథకం పనులను వేగవంతం చేసి త్వరగా పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) చంద్రయ్య అన్నారు. శుక్రవారం మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో కొనసాగుతున్న అమృత్ 2.0 పథకంలో భాగంగా నస్పూర్‌లోని ఆర్‌కే6 వద్ద నిర్మిస్తున్న 1 వేయి కిలోలీటర్ల సామర్థ్యం గల ఎలివేటెడ్ లెవల్ సర్వీస్ రిజర్వాయర్, హౌసింగ్ బోర్డు కాలనీలో నిర్మిస్తున్న 1 వేయి 500 కిలోలీటర్ల సామర్థ్యం గల ఈ.ఎల్.ఎస్.ఆర్. నిర్మాణ పనులను ఇంజనీరింగ్ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ పనులను నిర్దేశిత ప్రమాణాలు, నాణ్యతతో పాటు వేగవంతంగా పూర్తి చేయాలని తెలిపారు. పనులలో జాప్యం లేకుండా అదనపు కార్మికులను సమీకరించి, శ్రామిక బలాన్ని పెంచి త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. అమృత్ 2.0 పథకం క్రింద చేపట్టిన పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేసి ప్రజలకు మెరుగైన త్రాగునీటి సౌకర్యాలు అందుబాటులోకి తీసుకురావాలని తెలిపారు. అనంతరం నస్పూర్ లోని సమీకృత జిల్లా కార్యాలయాల భావన సముదాయంలో గల జిల్లా అదనపు కలెక్టర్ ఛాంబర్ లో అధికారులు, ఎల్.పి.జి. డీలర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలు, వసతి గృహాలకు ఎల్.పి.జి. గ్యాస్ సిలిండర్ల సరఫరాలో ఎలాంటి అంతరాయం కలగకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. గ్యాస్ సరఫరాలో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు ప్రణాళికతో వ్యవహరించాలని సూచించారు. ప్రభుత్వం నిర్దేశించిన కార్యాచరణ ప్రకారం వినియోగదారుల ఈకెవైసి ప్రక్రియను పూర్తి చేయాలని, నిర్ణీత గడువులోగా ప్రక్రియ పూర్తి చేసేలా వినియోగదారులకు అవగాహన కల్పించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# గుండారాజ్యం నుంచి గ్లోబల్ హబ్‌గా యూపీ..

- **మాఫియా అంతంతో పెట్టుబడులకు అనుకూల వాతావరణం.**
- **కేంద్ర హోంమంత్రి అమిత్ షా**



**గ్రేటర్ నోయిడా మహా** : ఉత్తరప్రదేశ్‌లో 2017కు ముందు ఉన్న మాఫియా, గుండారాజ్యాన్ని అంతం చేయడం ద్వారానే నేడు పెట్టుబడులకు అత్యంత అనుకూలమైన వాతావరణం ఏర్పడిందని కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఉద్ఘాటించారు. గ్రేటర్ నోయిడాలోని ఇండియా ఎక్స్‌పో సెంటర్‌లో శుక్రవారం ప్రారంభమైన ఉత్తరప్రదేశ్ అంతర్జాతీయ వాణిజ్య ప్రదర్శనలో ఆయన ప్రసంగించారు. ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ నేతృత్వంలోని ప్రభుత్వం శాంతి భద్రతలపై ఉక్కుపాదం మోపడం వల్లే రాష్ట్రం నేడు గ్లోబల్ హబ్‌గా రూపాంతరం చెందుతోందని ప్రశంసించారు. పరిశ్రమల స్థాపనకు మార్కెట్, మౌలిక వసతుల కంటే మెరుగైన శాంతిభద్రతలు అత్యంత కీలకమని ఆయన స్పష్టం చేశారు. 2013లో అప్పటి సమాజ్‌వాదీ పార్టీ ప్రభుత్వం రాష్ట్రంలో పెట్టుబడిదారుల సదస్సు నిర్వహించాలనుకున్నా, నాటి క్షీణించిన శాంతిభద్రతల కారణంగా ఆ కార్యక్రమాన్ని ఢిల్లీకి తరలించాల్సి వచ్చిన పరిస్థితిని ఈ సందర్భంగా ఆయన గుర్తుచేశారు. ఉత్తరప్రదేశ్‌ను ఒక ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దాలన్న బృహత్తర లక్ష్యంతో మోదీ, యోగి డబుల్ ఇంజిన్ ప్రభుత్వాలు సమన్వయంతో అడుగులు వేస్తున్నాయని అమిత్ షా తెలిపారు. సెప్టెంబర్ 25 నుంచి 29 వరకు జరగనున్న ఈ నాలుగో అంతర్జాతీయ వాణిజ్య ప్రదర్శన ఈ దిశగా ఒక కీలక ముందడుగుగా అభివర్ణించారు. ఆస్ట్రియా, బెలారస్, జపాన్, రష్యా, సింగపూర్, వియత్నాం దేశాల భాగస్వామ్యంతో జరుగుతున్న ఈ భారీ ప్రదర్శనలో 2,400కు పైగా దేశీయ ప్రదర్శనదారులు, 85 దేశాలకు చెందిన 550 మందికి పైగా అంతర్జాతీయ కొనుగోలుదారులు పాల్గొంటున్నారు. రాష్ట్రంలోని తయారీ, వ్యవసాయ, సాంకేతిక, రక్షణ రంగాలతో పాటు సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలను నేరుగా అంతర్జాతీయ మార్కెట్‌తో అనుసంధానం చేయడమే ఈ కార్యక్రమ ప్రధాన ఉద్దేశం.రాష్ట్రంలో ప్రతిష్ఠాత్మకంగా అమలవుతున్న 'ఒక జిల్లాఒక ఉత్పత్తి' (ఓడీఓపీ) కార్యక్రమం స్థానిక యువతకు వారి సొంత ప్రాంతాల్లోనే అపారమైన ఉపాధి అవకాశాలను సృష్టిస్తోందని అమిత్ షా కొనియాడారు. ఈ ప్రదర్శన వేదికగా ఓడీఓపీ కార్యక్రమానికి సంబంధించిన ప్రత్యేక వెబ్‌సైట్‌ను ఆయన లాంఛనంగా ప్రారంభించారు. డిజిటల్ వేదికల ద్వారా స్థానిక ఉత్పత్తులకు విశ్వవ్యాప్త గుర్తింపు తీసుకురావాలన్నది ప్రభుత్వ లక్ష్యమని వివరించారు. వ్యవసాయం, వస్త్ర, హస్తకళలు, ఆహార ప్రాసెసింగ్, ఎలక్ట్రానిక్స్ వంటి రంగాలతో పాటు రక్షణ ఉత్పత్తుల తయారీలోనూ యూపీ వేగంగా దూసుకెళ్తోందని చెప్పారు. రాష్ట్ర రక్షణ పారిశ్రామిక కారిడార్, లక్నోలోని బ్రహ్మోస్ పరీక్షా కేంద్రం వంటి ప్రాజెక్టులు రాష్ట్ర ఉత్పాదక సామర్థ్యానికి నిదర్శనమన్నారు.

# అర్ధరాత్రి కేజీబీవీ పైనుంచి దూకిన విద్యార్థిని

- **వైద్యం అందించడంలో సిబ్బంది తీవ్ర నిర్లక్ష్యం.**
- **అసలు వాస్తవాలు తేల్చాలని మహిళా కమిషన్ ఆదేశం.**

**అమరావతి, మహా :** నంద్యాల జిల్లా ఆత్మకూరులోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో (కేజీబీవీ) దారుణం చోటుచేసుకుంది. అర్ధరాత్రి వేళ ఓ విద్యార్థిని హాస్టల్ పైనుంచి దూకి తీవ్రంగా గాయపడగా, బాధితురాలికి సకాలంలో వైద్యం అందించకుండా సిబ్బంది తీవ్ర నిర్లక్ష్యం వహించారు. ఈ ఘటనపై రాష్ట్ర మహిళా కమిషన్ తీవ్రస్థాయిలో మండిపడింది. అసలు విద్యార్థిని ఎందుకు గోడ దూకాల్సి వచ్చింది, ఘటనను ఉన్నతాధికారులకు చెప్పకుండా ఎందుకు గోప్యంగా ఉంచారన్న దానిపై సమగ్ర విచారణ జరపాలని అధికారులను ఆదేశించింది.గురువారం అర్ధరాత్రి ఆత్మకూరు కేజీబీవీలో ఓ విద్యార్థిని బయటకు వెళ్లే క్రమంలో హాస్టల్ పైభాగం నుంచి కిందకు దూకింది. ఈ ఘటనలో ఆ బాలికకు తీవ్ర గాయాలయ్యాయి. అయితే, రక్తం మడుగులో ఉన్న విద్యార్థినిని వెంటనే ఆసుపత్రికి తరలించి ప్రాణాలు కాపాడాల్సిన సిబ్బంది.. శుక్రవారం ఉదయం వరకు హాస్టల్‌లోనే ఉంచడం వారి అమానుష తీరుకు అద్దం పడుతోంది. పైగా ఈ విషయాన్ని బయటకు పొక్కకుండా గోప్యంగా ఉంచే ప్రయత్నం చేయడం పలు అనుమానాలకు తావిస్తోంది. అత్యవసర సమయంలో కనీసం ఉన్నతాధికారులకు, తల్లిదండ్రులకు కూడా సకాలంలో సమాచారం అందించకపోవడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.ఈ ఘటనపై ఆంధ్రప్రదేశ్ మహిళా కమిషన్ చైర్‌పర్సన్ రాయపాటి శైలజ తీవ్రంగా స్పందించారు. ప్రాణాపాయ స్థితిలో ఉన్న బాలికకు తక్షణమే వైద్యం అందించకపోవడంపై సంబంధిత అధికారులను ఆమె గట్టిగా నిలదీశారు. వైద్యంలో జరిగిన జాప్యం బాధితురాలి ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. తక్షణమే విచారణ చేపట్టి పూర్తి నివేదిక అందించాలని ఐసీపీఎస్ డీసీపీఓ మంజునాథ్, సఖి మేనేజర్ శాంతామణిలను ఆదేశించారు. ముందుగా బాధిత బాలికకు మెరుగైన వైద్య సేవలు అందించి, ఆమె ప్రాణాలకు ముప్పు లేకుండా చూడాలని స్పష్టం చేశారు.అసలు బాలిక అర్ధరాత్రి ఎందుకు హాస్టల్ నుంచి బయటకు వెళ్లాలనుకుంది, తోటి విద్యార్థినులు లేదా సిబ్బందితో ఏమైనా విభేదాలు తలెత్తాయా, లేక మరేదైనా మానసిక ఒత్తిడికి గురైందా అన్న కోణంలో విచారణాధికారులు ఆరా తీస్తున్నారు. విద్యార్థినుల భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాల్సిన కేజీబీవీల్లో ఇలాంటి ఘటనలు జరగడం, దానిపై నిర్వాహకులు వ్యవహరించిన తీరు భద్రతా లోపాలను ఎత్తిచూపుతోంది. బాలిక వాంగ్మూలంతో పాటు సిబ్బంది, తోటి విద్యార్థులను విచారించి పారదర్శకమైన దర్యాప్తు జరిపితే తప్ప ఈ ఘటన వెనుక ఉన్న అసలు వాస్తవాలు వెలుగులోకి వచ్చే అవకాశం లేదు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా రాత్రి వేళల్లో పర్యవేక్షణ వ్యవస్థను బలోపేతం చేయాల్సిన ఆవశ్యకతను ఈ ఘటన గుర్తుచేస్తోంది.

# యూపీఐ ఎండీఆర్ చార్జీలపై ఆందోళన అవసరం లేదు.

- **వినియోగదారులపై అదనపు భారం ఉండదు.**
- **నిర్దిష్ట లావాదేవీలకు వ్యాపారులే రుసుము భరించాలి.**
- **నిర్మలా సీతారామన్**



**ఢిల్లీ, మహా:** యూపీఐ డిజిటల్ చెల్లింపులపై ఎండీఆర్ చార్జీలు విధించనున్నారనే ప్రచారంపై కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ స్పష్టత ఇచ్చారు. నిర్దిష్టంగా రూ.2,000కు మించిన వ్యాపార లావాదేవీలకు వర్తించే ఎండీఆర్ రుసుమును వినియోగదారులపైకి బదిలీ చేయబోమని తెలిపారు. ఈ చార్జీలతో సాధారణ ఖాతాదారులపై అదనపు ఆర్థిక భారం ఉండదని స్పష్టం చేశారు.

**వ్యాపారులకే ఎండీఆర్**

రూ.2,000కు మించిన నిర్దిష్ట యూపీఐ వ్యాపార లావాదేవీలకు 0.4 శాతం ఎండీఆర్ వర్తించే కొత్త విధానం అక్టోబర్ 15 నుంచి అమల్లోకి రానుంది. ఈ రుసుమును వ్యాపారులు, చెల్లింపు వ్యవస్థలోని సంబంధిత సంస్థలు భరించాల్సి ఉంటుందని ప్రభుత్వం స్పష్టం చేసింది. వినియోగదారులు యూపీఐ ద్వారా చెల్లింపు చేసినందుకు ప్రత్యేక రుసుము చెల్లించాల్సిన అవసరం ఉండదని పేర్కొంది.

**ప్రభుత్వానికి వెళ్లే పన్ను కాదు**

ఎండీఆర్ కేంద్ర ప్రభుత్వం విధించే పన్ను, సెస్ లేదా సర్‌చార్జ్ కాదని నిర్మలా సీతారామన్ వివరించారు. ఎండీఆర్ ద్వారా వచ్చే మొత్తం ప్రభుత్వ ఖజానాకు వెళ్లదని, బ్యాంకులు, చెల్లింపు సేవల సంస్థలు, ఇతర డిజిటల్ చెల్లింపు వ్యవస్థల నిర్వహణకు సంబంధించిన రుసుముగా ఉంటుందని తెలిపారు.

**వినియోగదారులకు యథావిధిగా ఉచిత సేవలు**

యూపీఐ ద్వారా చెల్లింపులు చేసే వినియోగదారులపై ఎండీఆర్ భారాన్ని మోపేందుకు అనుమతి లేదని మంత్రి స్పష్టం చేశారు. యూపీఐ వినియోగంలో ప్రజలకు అదనపు చార్జీ లేకుండా సేవలు కొనసాగుతాయని తెలిపారు. ఎండీఆర్ నిబంధనలపై అవగాహన లోపం కారణంగానే అపోహలు వ్యాపిస్తున్నాయని పేర్కొన్నారు.

**చిన్న వ్యాపారులకు మినహాయింపులు**

కొత్త విధానంలో చిన్న వ్యాపారులకు కూడా రక్షణ కల్పించారు. నెలకు రూ.1 లక్ష వరకు QR ఆధారిత యూపీఐ వసూళ్లు చేసే చిన్న వ్యాపారులకు ఎండీఆర్ నుంచి మినహాయింపు ఉంటుందని ప్రభుత్వం తెలిపింది. మొత్తం యూపీఐ లావాదేవీల్లో సుమారు 96 శాతం లావాదేవీలు ఈ కొత్త చార్జీ పరిధిలోకి రావని వెల్లడించింది.

**అపోహలకు తావివ్వొద్దు**

యూపీఐ చెల్లింపులపై వినియోగదారుల నుంచి అదనపు రుసుము వసూలు చేస్తారన్న ప్రచారాన్ని నమ్మవద్దని నిర్మలా సీతారామన్ సూచించారు. డిజిటల్ చెల్లింపుల వ్యవస్థను కొనసాగించేందుకు అవసరమైన నిర్వహణ వ్యయాలకు ఎండీఆర్ విధానం ఉపయోగపడుతుందని, అయితే దాని భారాన్ని వినియోగదారులపైకి బదిలీ చేయరాదని స్పష్టం చేశారు.

# లెక్టరేట్ ప్రారంభోత్సవానికి పకడ్బందీ ఏర్పాట్లు

- **చిన్నపాటి లోపానికీ తావులేకుండా ఏర్పాట్లు.. అధికారులంతా సమన్వయంతో పనిచేయాలి**
- **ప్రోటోకాల్ తప్పనిసరిగా పాటించాలి.. కార్యక్రమం ఆదర్శంగా నిలవాలి**
- **జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా**



**కరీంనగర్ మహా :** ఈ నెల 30న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల జరగనున్న కరీంనగర్ జిల్లా నూతన కలెక్టరేట్ భవన ప్రారంభోత్సవ కార్యక్రమానికి అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా అధికారులను ఆదేశించారు. కార్యక్రమ నిర్వహణలో ఎక్కడా చిన్నపాటి లోపానికీ తావులేకుండా పక్కా ప్రణాళికతో ముందుకు సాగాలని సూచించారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని స్పష్టం చేశారు.

**భవనాన్ని పరిశీలించిన కలెక్టర్**

శుక్రవారం రాత్రి నూతన కలెక్టరేట్ భవనాన్ని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా, అదనపు కలెక్టర్ రెవెన్యూ డి. శ్రీనివాస్‌రెడ్డితో పాటు పలువురు అధికారులతో కలిసి క్షుణ్ణంగా పరిశీలించారు. కలెక్టర్ చాంబర్, సమావేశ మందిరం, అదనపు కలెక్టర్ల చాంబర్లు, మంత్రుల సమీక్ష సమావేశాల కోసం ఏర్పాటు చేసిన హాళ్లు, ఇతర గదులను పరిశీలించి అవసరమైన ఏర్పాట్లపై అధికారులకు సూచనలు చేశారు.

**పండుగ వాతావరణంలో ప్రారంభోత్సవం**

నూతన కలెక్టరేట్ భవనాన్ని అత్యంత సుందరంగా అలంకరించాలని, ప్రారంభోత్సవ కార్యక్రమం పండుగ వాతావరణంలో జరిగేలా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ సూచించారు. జిల్లా నూతన కలెక్టరేట్ ప్రారంభోత్సవం ఇతర జిల్లాలకు ఆదర్శంగా నిలిచేలా ప్రతి అంశాన్ని ప్రణాళికాబద్ధంగా నిర్వహించాలని పేర్కొన్నారు.

**ప్రోటోకాల్‌కు ప్రాధాన్యం**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రులు, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, పోలీసు అధికారులు, ఇతర ఉన్నతాధికారుల పర్యటన నేపథ్యంలో ప్రోటోకాల్‌ను తప్పనిసరిగా పాటించాలని కలెక్టర్ ఆదేశించారు. వారికి స్వాగతం పలకడంతో పాటు కార్యక్రమం పూర్తయ్యే వరకు సమన్వయం చేసేందుకు లైజనింగ్ అధికారులను ఏర్పాటు చేయాలని సూచించారు. అధికారులు తమకు అప్పగించిన బాధ్యతలను సమర్థంగా నిర్వర్తించాలని తెలిపారు.

**తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణకు ఏర్పాట్లు**

కలెక్టరేట్ ప్రారంభోత్సవంతో పాటు తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణ కార్యక్రమానికి సంబంధించి కూడా పటిష్ఠ ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ సూచించారు. వేదిక, ప్రెస్ గ్యాలరీ, అతిథులు, ప్రజలు, మీడియాకు అవసరమైన ఇతర సదుపాయాల విషయంలో ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. సమావేశ మందిరంలో మంత్రులు, ఎమ్మెల్యేలు, రాష్ట్ర, జిల్లా స్థాయి అధికారులు కూర్చునే విధంగా సీటింగ్ ఏర్పాట్లు పక్కాగా చేయాలని సూచించారు. కార్యక్రమం నిర్వహణలో చివరి నిమిషంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రతి అంశాన్ని ముందుగానే పరిశీలించి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ పేర్కొన్నారు. నూతన కలెక్టరేట్ భవన ప్రారంభోత్సవం ఘనంగా, సమర్థవంతంగా జరిగేలా అధికారులు సమష్టిగా కృషి చేయాలని సూచించారు.

కలెక్టర్ వెంట అదనపు కలెక్టర్ రెవెన్యూ డి. శ్రీనివాస్‌రెడ్డి, డీఆర్వో స్వామి, ఆర్డీవో షర్మిల, ఏవో సుధాకర్, ఆర్అండ్‌బీ అధికారులు, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ఛత్తీస్‌గఢ్‌లో ఘోర రోడ్డు ప్రమాదం

- **ఆరుగురు దుర్మరణం.**
- **ట్రక్కు, పికప్ వాహనం ఢీ.**
- **మరో ఏడుగురికి తీవ్రగాయాలు.**

**బలోద్,మహా :** ఛత్తీస్‌గఢ్‌లోని బలోద్ జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. ధమతరి-కంకేర్ జిల్లాల మధ్య జాతీయ రహదారి 30పై మార్కటోలా ఘాట్ సమీపంలో శుక్రవారం వరి ధాన్యం లోడుతో వెళ్తున్న ఓ ట్రక్కు, డీజే పరికరాలతో ప్రయాణిస్తున్న పికప్ వాహనం బలంగా ఢీకొన్నాయి. ఈ దుర్ఘటనలో ఆరుగురు ప్రాణాలు కోల్పోగా, మరో ఏడుగురు తీవ్రంగా గాయపడ్డారు. ప్రమాద తీవ్రతకు పికప్ వాహనం నుజ్జునుజ్జు కాగా, అందులో ఉన్న డీజే పరికరాలు పూర్తిగా ధ్వంసమయ్యాయి. సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని హుటాహుటిన సహాయక చర్యలు చేపట్టారు.పురూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని మార్కటోలా ఘాట్ వద్ద ఈ ప్రమాదం జరిగినట్లు బలోద్ అదనపు పోలీసు సూపరింటెండెంట్ (ఏఎస్పీ) చంద్రకాంత్ గోవర్ణ తెలిపారు. ట్రక్కు ఢీకొట్టిన వేగానికి పికప్ వాహనంలోని వారు తీవ్రంగా గాయపడ్డారు. వారిలో కొందరు అక్కడికక్కడే మృతి చెందగా, ప్రాణాపాయ స్థితిలో ఉన్న ఏడుగురిని స్థానికుల సాయంతో పోలీసులు వెంటనే సమీపంలోని ఆసుపత్రికి తరలించారు. క్షతగాత్రుల ఆరోగ్య పరిస్థితిని వైద్యులు నిశితంగా పర్యవేక్షిస్తున్నారని, మెరుగైన వైద్యం కోసం అవసరమైతే పెద్దాసుపత్రులకు తరలిస్తామని అధికారులు వెల్లడించారు. ప్రమాదం కారణంగా రహదారిపై వాహనాల శకలాలు, ధాన్యం బస్తాలు చెల్లాచెదురుగా పడిపోవడంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. వెంటనే రంగంలోకి దిగిన పోలీసులు అడ్డంకులను తొలగించి రాకపోకలను పునరుద్ధరించారు.

ప్రమాదానికి గల కారణాలపై పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. ఘాట్ రోడ్డులోని మలుపుల వద్ద వాహనాలు అతివేగంతో ప్రయాణించడం వల్లే ఈ దుర్ఘటన జరిగిందా లేదా డ్రైవర్ల నిర్లక్ష్యం ఏమైనా ఉందా అనే కోణంలో విచారణ జరుపుతున్నారు. సాంకేతిక ఆధారాలతో పాటు ఘటనాస్థలిలో పరిస్థితులను విశ్లేషిస్తున్నారు. మరోవైపు మృతుల వివరాలను సేకరించి, వారి కుటుంబ సభ్యులకు సమాచారం అందించే ప్రక్రియను అధికారులు చేపట్టారు. ఏడుగురు ఆసుపత్రిలో ప్రాణాపాయ స్థితిలో కొట్టుమిట్టాడుతుండటం, ఆరుగురు అకస్మాత్తుగా ప్రాణాలు కోల్పోవడంతో బాధితుల కుటుంబాల్లో తీవ్ర విషాదం అలుముకుంది.

# పొగాకు రైతులకు కేంద్రం తీపికబురు

**అమరావతి, మహా :** ఆంధ్రప్రదేశ్‌లోని ఎఫ్‌సీవీ పొగాకు రైతులకు కేంద్ర ప్రభుత్వం కీలక ఊరట కల్పించింది. పంట సాగు, క్యూరింగ్ ప్రక్రియ, బార్న్ నిర్వహణకు అవసరమైన పెట్టుబడుల కోసం ప్రతి బార్న్‌కు రూ.50 వేల చొప్పున వడ్డీ లేని రుణం అందించాలని కేంద్ర వాణిజ్య, పరిశ్రమల మంత్రిత్వ శాఖ నిర్ణయించింది. ప్రకృతి వైపరీత్యాలు, పంట నష్టాలు, ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్న పొగాకు రైతులకు తక్షణ ఆర్థిక సహాయం అందించడమే ఈ నిర్ణయం ఉద్దేశమని కేంద్రం వెల్లడించింది. అధిక వడ్డీలకు ప్రైవేట్ వడ్డీ వ్యాపారులను ఆశ్రయించాల్సిన పరిస్థితి తగ్గుతుందని రైతులు భావిస్తున్నారు.ఎఫ్‌సీవీ పొగాకు సాగు సాధారణ పంటలతో పోలిస్తే అధిక పెట్టుబడితో కూడుకున్న వ్యవసాయ ప్రక్రియ. విత్తనాల నుంచి నారు పెంపకం, పొలాల సిద్ధం, నాట్లు, ఎరువులు, పురుగుమందులు, కూలీల ఖర్చులు ఇలా ప్రతి దశలో రైతులు గణనీయమైన మొత్తాన్ని వెచ్చించాల్సి ఉంటుంది. పంట కోత అనంతరం ఆకులను క్యూరింగ్ చేయడం, బార్న్‌లలో ఎండబెట్టడం వంటి ప్రక్రియలకు కూడా అదనపు వ్యయం అవుతుంది.

**వాతావరణం మారితే నష్టం తప్పదు**

పొగాకు సాగులో వాతావరణ పరిస్థితులు అత్యంత కీలక పాత్ర పోషిస్తాయి. సాగు దశలో వర్షాలు, అధిక ఉష్ణోగ్రతలు, తేమ, గాలులు వంటి ప్రకృతి పరిస్థితులు పంట దిగుబడిపై ప్రభావం చూపుతాయి. పంట కోత సమయంలో లేదా క్యూరింగ్ దశలో ప్రతికూల వాతావరణం ఏర్పడితే నాణ్యత దెబ్బతినే అవకాశం ఉంటుంది. ఫలితంగా రైతుకు దిగుబడి తగ్గడంతోపాటు మార్కెట్‌లో లభించే ధరపైనా ప్రభావం పడుతుంది.

**బార్న్ నిర్వహణకు ప్రత్యేక ఖర్చులు**

ఎఫ్‌సీవీ పొగాకు సాగులో బార్న్ నిర్వహణకు ప్రత్యేక ప్రాధాన్యం ఉంటుంది. పొగాకు ఆకులను నాణ్యమైన రీతిలో క్యూరింగ్ చేయడానికి బార్న్‌లను సిద్ధం చేయడం, అవసరమైన ఇంధనం, కార్మికులు, నిర్వహణ తదితర అంశాలపై రైతులు ఖర్చు చేయాల్సి ఉంటుంది. పంటకు సంబంధించిన పెట్టుబడి మొత్తంలో ఈ వ్యయాలు కూడా గణనీయమైన భాగాన్ని ఆక్రమిస్తాయి. ఈ నేపథ్యంలో ప్రతి బార్న్‌కు రూ.50 వేల వడ్డీ లేని రుణం అందుబాటులోకి రావడం రైతులకు తక్షణ నగదు అవసరాలను తీర్చుకునే అవకాశాన్ని కల్పించనుంది.

ANN తెలుగు
మహా పత్రిక
శనివారం, హైదరాబాద్
26-09-2026

మహా ప్రత్యేకం



# గణపతి బప్పా మోరియా

గణపతి బప్పా మోరియా నినాదాలతో ట్యాంక్‌బండ్ రెండురోజులుగా మార్మోగుతూనే ఉంది. నిమజ్జనం కోసం భారీగా తరలివచ్చిన భక్తులతో శుక్రవారం పరిసరాలు జనసంద్రంగా మారాయి. వేలాది విగ్రహాలు, వీటిని తిలకించి పులకించేందుకు వచ్చిన లక్షలాది ప్రజలతో ట్యాంక్ బండ్ పరిసరాలు, హైదరాబాద్ సిటీ ఆధ్యాత్మిక వాతావరణంతో అలరారింది. ట్యాంక్‌బండ్‌పై కనిపించిన గణేశ్ నిమజ్జన వైభవాన్ని ఫొటోల్లో చూడండి.

















# మణుగూరు నయాగరా.. రథం గుట్ట జలధార..

- వర్షా లతో పరవళ్లు తొక్కుతున్న జలపాతం..
- పచ్చని కొండలు.. వెండి తెరలా జాలువారే నీటి ధారలు..
- అర్బన్ పార్కుతో పెరుగుతున్న సందడి
- ప్రత్యేక పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలని ప్రజల ఆకాంక్ష..





**మణుగూరు, మహా :** ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరులోని రథం గుట్ట ప్రకృతి సోయగాలతో కనువిందు చేస్తోంది. గుట్టపై నుంచి జాలువారుతున్న వర్షపు జలధారలు అందమైన జలపాతంగా మారి చూపరులను కట్టిపడేస్తున్నాయి. కొండ అంచుల నుంచి వెండితెరలా కిందికి దూకుతున్న నీటి ప్రవాహాలు, చుట్టూ పరుచుకున్న పచ్చదనం రథం గుట్టకు సరికొత్త శోభను తీసుకొచ్చాయి. వర్షాలు సమృద్ధిగా కురిసిన సమయంలో రథం గుట్ట రూపురేఖలే మారిపోతాయి. కొండపై నుంచి ఒకేసారి అనేక జలధారలు కిందికి జాలువారుతుండడంతో ఈ ప్రాంతం సహజ జలపాతాన్ని తలపిస్తోంది. చుట్టూ పచ్చని కొండలు.. మధ్యలో జలధారల సవ్వడి.. వర్షపు చినుకుల మధ్య ఆహ్లాదకర వాతావరణం సందర్శకులను పరవశింపజేస్తోంది. ఈ అందాలను చూసిన స్థానికులు రథం గుట్ట జలపాతాన్ని సరదాగా మణుగూరు నయాగరాగా అభివర్ణిస్తున్నారు.

**లధార పెరిగితే.. సందర్శకుల సందడి**

గుట్టపై నీటి ప్రవాహం ఉధృతంగా ఉండే రోజుల్లో రథం గుట్ట వద్ద సందర్శకుల సందడి మరింత పెరుగుతోంది. మణుగూరు పట్టణంతోపాటు పినపాక, అశ్వాపురం, బూర్గంపాడు తదితర ప్రాంతాల నుంచి కూడా ప్రకృతి ప్రేమికులు, యువత, కుటుంబాలు ఈ జలపాతాన్ని వీక్షించేందుకు వస్తుంటారు. జలధారల మధ్య సెల్ఫీలు, ఫొటోలు తీసుకుంటూ ప్రకృతి అందాలను ఆస్వాదిస్తున్నారు.

**అర్బన్ పార్కుతో కొత్త ఆకర్షణ**

రథం గుట్ట ప్రాంతంలో అర్బన్ పార్కు ఏర్పాటు కావడం ఈ ప్రాంతానికి మరో ప్రత్యేకతగా మారింది. ఇటీవల అర్బన్ పార్కును సందర్శించే వారి సంఖ్య కూడా క్రమంగా పెరుగుతోంది. ఒకవైపు పచ్చని ప్రకృతి, మరోవైపు వర్షాకాలంలో కనువిందు చేసే సహజ జలపాతం, వీటికి తోడు అర్బన్ పార్కు ఉండడంతో ఈ ప్రాంతాన్ని సమగ్ర పర్యాటక ప్రదేశంగా తీర్చిదిద్దేందుకు అనువైన పరిస్థితులు ఉన్నాయని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

**పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దిత.**

రథం గుట్ట సహజ అందాలను కాపాడుతూనే అవసరమైన మౌలిక వసతులు కల్పిస్తే మణుగూరుకు ప్రత్యేక పర్యాటక గుర్తింపు వచ్చే అవకాశముందని ప్రజలు పేర్కొంటున్నారు. సందర్శకులకు సురక్షితమైన వ్యూ పాయింట్లు, నడక మార్గాలు, కూర్చునేందుకు ఏర్పాట్లు, పార్కింగ్, తాగునీరు, పరిశుభ్రతతోపాటు జలపాతం వద్ద ప్రమాదాలు జరగకుండా రక్షణ చర్యలు చేపట్టాలని కోరుతున్నారు. రథం గుట్ట జలపాతం-అర్బన్ పార్కును అనుసంధానం చేస్తూ అభివృద్ధి చేస్తే మణుగూరు సబ్‌డివిజన్‌లోనే ఆకర్షణీయమైన పర్యాటక ప్రాంతంగా రూపుదిద్దుకునే అవకాశం ఉందని స్థానికులు చెబుతున్నారు. పర్యాటకుల రాక పెరిగితే స్థానికంగా చిరు వ్యాపారాలు, ఉపాధి అవకాశాలు కూడా పెరుగుతాయని భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు ప్రత్యేక చొరవ తీసుకొని రథం గుట్ట ప్రాంతాన్ని పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేసేందుకు చర్యలు చేపట్టాలని మణుగూరు ప్రజలు ఆకాంక్షిస్తున్నారు. ప్రకృతి ప్రసాదించిన ఈ అందమైన జలపాతానికి అవసరమైన మెరుగులు దిద్దితే మణుగూరు నయాగరా పర్యాటకులను ఆకర్షించే ప్రత్యేక గమ్యస్థానంగా నిలుస్తుందని స్థానికులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.



## గుండెపోటుతో వేములవాడ అగ్నిమాపక అధికారి మృతి

**వేములవాడ, మహా:** వేములవాడ అగ్నిమాపక శాఖలో విధులు నిర్వహిస్తున్న నాగు అనిల్ గుండె పోటుతో వసు చెందడంతో పట్టణంలో విషాదఛాయలు చోటు చేసుకున్నాయి.స్థానికుల వివరాల ప్రకారం వేములవాడలోని ఫైర్ స్టేషన్ ఆఫీసర్ అనిల్ కుమార్ విధులు నిర్వహిస్తున్న ఆయన శుక్రవారం హైదరాబాద్‌లోని తన నివాసంలో ఉదయం గుండెపోటు రావడంతో ఆయన తుదిశ్వాస విడిచారు.2008 బ్యాచ్‌కు చెందిన అనిల్ కుమార్ డ్రైవర్‌గా అగ్నిమాపక శాఖలో చేరి, స్టేషన్ ఫైర్ ఆఫీసర్ స్థాయికి ఎదిగారు.గత రెండు సంవత్సరాలుగా వేములవాడ అగ్నిమాపక అధికారిగా విధులు నిర్వహిస్తూ సిబ్బంది, ప్రజల మన్ననలు పొందారు.వేములవాడలో అగ్నిప్రమాద నివారణపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించడంతో పాటు, అగ్నిప్రమాదాలు సంభవించిన సమయంలో తన సిబ్బందితో కలిసి అనేక సహాయక చర్యల్లో పాల్గొన్నారు. ప్రమాదాల సమయంలో అప్రమత్తంగా వ్యవహరిస్తూ ప్రాణ, ఆస్తి నష్టాలను నివారించడంలో కీలకంగా పనిచేశారు. అనిల్ కుమార్ మృతితో వేములవాడ అగ్నిమాపక శాఖ సిబ్బంది, కుటుంబ సభ్యులు తీవ్ర విషాదంలో మునిగిపోయారు. ఆయన అంత్యక్రియలు శుక్రవారం సాయంత్రం నల్గొండ జిల్లా తుమ్మలగూడెం స్వగ్రామంలో నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.



## ప్రార్థన మందిరాలు సంక్షేమ కేంద్రాలుగా నిలవాలి

- జమాతే ఇస్లామి హింద్ సభ్యులు షేక్ అబ్దుల్ బాసిత్

**భద్రాద్రి కొత్తగూడెం, మహా:** మసీదులు అంటే కేవలం నమాజ్ ఆచరించే స్థలాలు మాత్రమే కాదని మానవ సమస్యల పరిష్కారానికి కేంద్రాలు అని జమాతే ఇస్లామి హింద్ సభ్యులు షేక్ అబ్దుల్ బాసిత్ అన్నారు. పవిత్ర శుక్రవారం సందర్భంగా లక్ష్మీదేవిపల్లి లోని "మస్జిద్ ఎ ఆక్సా" జరిగిన ఒక కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం కాలంలో మసీదులు మానవ సంక్షేమ పథకాలకు కేంద్రాలుగా ఉండేవని పేర్కొన్నారు. 1450 సంవత్సరాల క్రితం అనాథల వితంతుల అవసరాలు తీర్చే విధంగా కృషి చేశారని ముఖ్యంగా చదువు సంస్కారం నేర్పించే ఏర్పాటు ఉండేదని అన్నారు. రాను రాను మస్జిద్ అంటే కేవలం ముస్లింలు నమాజ్ ఆచరించే ప్రదేశాలుగా మారిపోవడం విచారకరం అన్నారు. ప్రవక్త ముహమ్మద్ కాలంలో అన్ని వర్గాల ప్రజలు తమ సమస్యల పరిష్కారానికి మదీనాలోని "మస్జిద్ ఎ నబవీ"కు వచ్చేవారిని గుర్తుచేసారు. ఖురాన్ ప్రవక్త ముహమ్మద్ బోధనలు మానవాళికి సంస్కరణ వారి అవసరాలను తీర్చడం దైవారాధనగా పేర్కొన్నాయని అన్నారు. నేల మీద ఉన్న వారిని కరుణించు నింగిలో ఉన్నవాడు అంటే దైవం నిన్ను కరుణిస్తాడన్నారు. అనాథల వితంతువుల అగత్యపరుల సేవ పగలంతా ఉపవాసం రాత్రంతా జాగరణ మంచిని పెంచడానికి చెడును నివారించడానికి దైవ మార్గంలో జిహాద్ చేయడం లాంటిదని చెప్పి మానవ సేవే మాధవ సేవ అని చాటారు ప్రవక్త ముహమ్మద్ అన్నారు. ఈ సృష్టి సమతుల్యత దెబ్బతీయకండి అన్న ఖురాన్ వాక్యం పర్యావరణ పరిరక్షణను ప్రేరేపిస్తుందని పేర్కొన్నారు. ఒక మనిషి ప్రాణం కాపాడితే యావత్ మానవాళి ప్రాణాలు కాపాడినట్లు అన్న అల్లాహ్ ఆదేశం రక్త దానం అనారోగ్యంతో బాధపడుతున్న వారికి మందులు ఇతర వైద్య సేవలు అందించడాన్ని ప్రేరణ అన్నారు. ప్రార్థన మందిరాలలో యువతకు జ్ఞానార్జన కోసం లైబ్రరీ కంప్యూటర్ శిక్షణ కేంద్రాలుగా వృత్తి శిక్షణ కేంద్రాలుగా ప్రతి మూడు నెలలకోసారి రక్త దానం హెల్త్ క్యాంపులు నిర్వహించి పేదలకు ఉచిత వైద్య సేవ చేసే కేంద్రాలుగా మార్చాలని కోరారు. ఇటీవల ఢిల్లీ జామ మస్జిద్ లో ఇద్దరు యువకులు ఒక బాలిక వైద్య ఖర్చుల నిమిత్తం 6 కోట్ల 30 లక్షలు సమకూర్చారు. కుల మతాలకు అతీతంగా ఇలాంటి కార్యక్రమాలు సమాజంలో శాంతి సామరస్యానికి నిలయాలుగా నిలుస్తాయని అన్నారు. ఈ కార్యక్రమంలో మౌలానా అన్వర్ సాబ్, రీయాజ్, చాంద్ పాషా, ఇమామ్ షరీఫ్, అహ్మద్ షరీఫ్, అన్వర్ తదితరులు పాల్గొన్నారు.



## వయోవృద్ధుల హక్కులపై అవగాహన పోస్టర్ల ఆవిష్కరణ

**పెద్దపల్లి మహా :** అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహిస్తున్న వారోత్సవాల్లో భాగంగా జిల్లాలో వయోవృద్ధుల సంక్షేమం, సంరక్షణ, వారి హక్కులపై అవగాహన కల్పించేందుకు రూపొందించిన పోస్టర్లను జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష ఆవిష్కరించారు. శుక్రవారం కలెక్టరేట్ చాంబర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో వయోవృద్ధుల సంక్షేమం, సంరక్షణకు సంబంధించిన పోస్టర్లతో పాటు ఎల్డర్ గైడ్ పోస్టర్లను కలెక్టర్ ఆవిష్కరించారు. వయోవృద్ధుల హక్కులు, వారికి అందాల్సిన సంక్షేమ సేవలు, సంరక్షణ చర్యలపై ప్రజల్లో అవగాహన పెంచేందుకు ఇలాంటి కార్యక్రమాలు దోహదపడతాయని అధికారులు తెలిపారు.



## కొత్తగూడెంకు అదనపు కోర్టులు కేటాయింపు

**హర్షం వ్యక్తం చేసిన మహేష్ గడిపెల్లి**

భద్రాద్రి కొత్తగూడెం, మహా: కొత్తగూడెంకు మూడు అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టుల కేటాయింపు పట్ల జిల్లా న్యాయవాదుల సంఘం ప్రధాన కార్యదర్శి మహేష్ గడిపెల్లి ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. కాక్షిదారులకు సత్వరన్యాయం అందించేందుకు ప్రజావసరాల దృష్ట్యా మూడు కోర్టులు మంజూరు చేయడం సముచితమన్నారు. తెలంగాణ ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా 200 నూతన అదనపు జూనియర్ సివిల్ జడ్జికమ్‌అదనపు జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ ఆఫ్ ఫస్ట్ క్లాస్ కోర్టులను మంజూరు చేయడం సంతోషదాయకమని అన్నారు. కోర్టుల మంజూరులో జిల్లాకు అధిక ప్రాధాన్యం ఇచ్చిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కాంగ్రెస్ పార్టీకి జిల్లా మంత్రులకి హృదయ పూర్వక కృతజ్ఞతలు తెలిపారు. తెలంగాణ వచ్చినాక ఇన్ని కోర్టులు మంజూరు చేయడం చరిత్రత్మకం అని అన్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రజలు రేవంత్ రెడ్డిని గుండెల్లో పెట్టుకొంటారాని అన్నారు.భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు మొత్తం ఐదు కోర్టులు మంజూరయ్యాయని వాటిలో కొత్తగూడెంకు మూడు, భద్రాచలంకు ఒకటి మణుగూరుకు ఒకటి కేటాయించారని పేర్కొన్నారు. కొత్తగూడెంకు కేటాయించిన మూడు కోర్టుల్లో త్వరితగతిన కావాల్సిన సదుపాయాలను కల్పించాలని కోరారు.నూతన కోర్టుల ఏర్పాటు వల్ల కక్షిదారులకు న్యాయం మరింత చేరువవుతుందని తెలిపారు. అదే సమయంలో కోర్టులపై ఉన్న కేసుల భారం తగ్గి సమయం ఆదావుతుందన్నారు. భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకొని నూతన కోర్టుల ఏర్పాటు చేసినందుకు మహేష్ గడిపెల్లి సంతోషం వ్యక్తం చేశారు.

## గోదావరి వరద పట్ల అప్రమత్తంగా ఉండాలి

**అధికారులు అందుబాటులో ఉండాలి**
**భద్రాద్రి జిల్లా కలెక్టర్ అంకిత్**



**భద్రాద్రి కొత్తగూడెం, మహా :** జిల్లాలో వర్షాలు గోదావరి వరద పరిస్థితిపై జిల్లా కలెక్టర్ అంకిత్ శుక్రవారం సంబంధిత శాఖల అధికారులు తహసీల్దార్లతో టెలీకాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. వర్షపాతం గోదావరి నీటిమట్టం రహదారులు వంతెనలు పాఠశాలలు పంటలు ఇళ్ల నష్టంపై మండలాల వారీగా వివరాలు తెలుసుకున్నారు. భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం క్రమంగా పెరుగుతున్న నేపథ్యంలో పరిస్థితిని నిరంతరం పర్యవేక్షించాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రాణహిత నుంచి సుమారు లక్ష క్యూసెక్కుల ప్రవాహం వస్తున్నట్లు అధికారులు తెలిపారు. ప్రస్తుత పరిస్థితుల ప్రకారం నీటిమట్టం 25 నుంచి 30 అడుగుల వరకు పెరిగే అవకాశం ఉన్నందున అప్రమత్తంగా ఉండాలని సూచించారు. నిమజ్జన కార్యక్రమాల నేపథ్యంలో భద్రతా ఏర్పాట్లు బారికేడింగ్ సిబ్బంది విధులను పర్యవేక్షించాలని ఆదేశించారు. జిల్లాలోని పాత వంతెనలు కల్వర్టులు రహదారులను పరిశీలించి ప్రమాదకర ప్రాంతాల్లో ముందస్తు చర్యలు చేపట్టాలని కలెక్టర్ సూచించారు. ములకలపల్లి వద్ద దెబ్బతిన్న వంతెనపై రాకపోకలను నిలిపివేసి ప్రత్యామ్నాయ మార్గం ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు. దెబ్బతిన్న బ్రిడ్జి మరమ్మతుల కోసం ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు. శిథిలావస్థలో ఉన్న పాఠశాల భవనాలను వినియోగించకుండా తగిన చర్యలు తీసుకోవాలని అవసరమైన చోట విద్యార్థులను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని కలెక్టర్ సూచించారు. తాగునీరు మధ్యాహ్న భోజనం కలుషితం కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రస్తుతం వర్షాలతో పంటలకు ఎలాంటి నష్టం లేదని వ్యవసాయ శాఖ అధికారులు తెలిపారు. క్షేత్ర స్థాయిలో పంటలు ఇళ్ల నష్టం తదితర పరిస్థితులను పరిశీలించి నష్టం ఉంటే వెంటనే నివేదించాలని కలెక్టర్ సూచించారు. అధికారులు హెడ్‌క్వార్టర్లలో అందుబాటులో ఉండాలని అత్యవసర పరిస్థితుల్లో తక్షణమే స్పందించాలని కలెక్టర్ అంకిత్ స్పష్టం చేశారు. అన్ని శాఖలు సమన్వయంతో పరిస్థితిని నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు.

## సీఎంఆర్‌ఎఫ్‌తో పేద కుటుంబాలకు అండ

**35 మంది లబ్ధిదారులకు రూ.13.84 లక్షల విలువైన చెక్కుల పంపిణీ**

**సత్తుపల్లి, సెప్టెంబర్ 25: మహా :** అనారోగ్యంతో వైద్య ఖర్చులు భరించలేక ఇబ్బందులు పడుతున్న పేద, మధ్యతరగతి కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎంఆర్‌ఎఫ్) అండగా నిలుస్తోందని సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ అన్నారు. సత్తుపల్లి పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో పట్టణ, మండల పరిధికి చెందిన 35 మంది లబ్ధిదారులకు సహాయనిధి చెక్కులను అందజేశారు. మున్సిపాలిటీ పరిధిలోని ఏడుగురికి రూ.5,50,500, మండల పరిధిలోని 28 మందికి రూ.8,29,000 విలువైన చెక్కులను పంపిణీ చేశారు. వైద్య చికిత్సల కోసం ఆర్థిక సాయం అందిస్తూ అర్హులైన కుటుంబాలకు ప్రభుత్వం చేయూతనిస్తోందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. సంక్షేమ, అభివృద్ధి పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రజల సంక్షేమానికి కృషి చేస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డికి ఆమె కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ రోహణ బేగం కమల్ పాషా, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ దోమ ఆనంద్, జాతీయ బీసీ సంఘం ఖమ్మం జిల్లా అధ్యక్షుడు నారాయణవరపు శ్రీనివాస్, సీనియర్ నాయకులు బొంతు వేణు, సుమలత, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు గాదె చెన్నారావు, మండల అధ్యక్షుడు సుబ్బారెడ్డి, కౌన్సిలర్లు, సర్పంచులు, ఉపసర్పంచులు, వార్డు సభ్యులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, మహిళా, యువజన కాంగ్రెస్, ఎన్‌ఎస్‌యూఐ ప్రతినిధులు, ప్రజలు, లబ్ధిదారులు పాల్గొన్నారు.



## కోతుల బెడదతో ప్రజలకు కంటిమీద కునుకు కరువు

- ఇళ్లలోకి చొరబడి దాడులు.. పంటలకు తీవ్ర నష్టం
- పట్టించుకోని అధికారుల తీరుపై ప్రజల ఆగ్రహం!?

**పెద్దపల్లి మహా :** కాల్వ శ్రీరాంపూర్: మండలంలోని పలు గ్రామాల్లో కోతుల బెడద రోజురోజుకూ పెరుగుతోంది. కోతులు ఇళ్లలోకి చొరబడి ప్రజలపై దాడులకు పాల్పడుతున్న ఘటనలు పునరావృతమవుతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో గ్రామీణ ప్రాంతాల ప్రజలు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు.మరోవైపు కోతులు పంట పొలాల్లోకి ప్రవేశించి వివిధ రకాల పంటలను ధ్వంసం చేస్తుండటంతో రైతులు నష్టాలను చవిచూస్తున్నారు. ఇళ్లపైకి ఎక్కుతున్న కోతులు రేకులు, గూనపెంకులతో నిర్మించిన ఇళ్లను సైతం పాడుచేస్తున్నాయని గ్రామస్తులు చెబుతున్నారు. కోతుల సంచారంతో చిన్నారులు, వృద్ధులు బయటకు రావాలంటేనే భయపడాల్సిన పరిస్థితి నెలకొందని వాపోతున్నారు.కోతుల బెడదను నివారించాలని పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఇప్పటివరకు శాశ్వత పరిష్కారం చూపలేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. ప్రజల సమస్యలను పరిష్కరించాల్సిన ప్రజాప్రతినిధులు సైతం పట్టించుకోని ధోరణి అవలంబిస్తున్నారని అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, ఉన్నతాధికారులు స్పందించి కోతుల బెడదను అరికట్టేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని, ప్రజలకు రక్షణ కల్పించడంతో పాటు పంటలను కాపాడేలా చర్యలు తీసుకోవాలని శ్రీరాంపూర్ మండల గ్రామ లలోని ప్రజలు కోరుతున్నారు.

## ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం సానుకూల స్పందన

- దసరాకు రెండు డీఏలు.. సంక్రాంతికి మరో డీఏ విడుదలకు హామీ
- సీపీఎస్‌పై ప్రత్యేక కమిటీ.. పీఆర్‌సీ, ఈహెచ్‌ఎస్ సమస్యల పరిష్కారానికి చర్యలు
- తెలంగాణ ఉద్యోగుల జేఏసీ చైర్మన్ మారం జగదీశ్వర్



**కరీంనగర్ మహా, :** ఉద్యోగుల ప్రధాన సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం సానుకూలంగా స్పందించిందని తెలంగాణ రాష్ట్ర ఉద్యోగుల జేఏసీ చైర్మన్ మారం జగదీశ్వర్ తెలిపారు. దసరా సందర్భంగా రెండు డీఏలను, సంక్రాంతి నాటికి మరో డీఏను విడుదల చేస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చిందని వెల్లడించారు. కరీంనగర్‌లోని టీఎన్జీవోల సంఘం భవనంలో శుక్రవారం మారం జగదీశ్వర్ అధ్యక్షతన నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం ఉద్యోగ సంఘాల ఆధ్వర్యంలో 'చలో హైదరాబాద్' కార్యక్రమానికి పిలుపునిచ్చిన నేపథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా లక్షలాది మంది ఉద్యోగులు సమాయత్తమయ్యారని తెలిపారు. ఉద్యోగుల్లో నెలకొన్న అసంతృప్తిపై ఇంటెలిజెన్స్ విభాగం నివేదికలు కూడా ప్రభుత్వానికి చేరాయని పేర్కొన్నారు.

**సీఎం జోక్యంతో చలో హైదరాబాద్ వాయిదా**

అసెంబ్లీ సమావేశాలు కొనసాగుతున్న సమయంలో ముఖ్యమంత్రి జోక్యం చేసుకుని 'చలో హైదరాబాద్' కార్యక్రమాన్ని వాయిదా వేసుకోవాలని కోరారని మారం జగదీశ్వర్ తెలిపారు. ఉద్యోగుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని జేఏసీ ఆ కార్యక్రమాన్ని వాయిదా వేసిందన్నారు. అనంతరం ప్రభుత్వం, ఉద్యోగ సంఘాల మధ్య జరిగిన చర్చల్లో ఉద్యోగుల ప్రధాన సమస్యల పరిష్కారానికి సంబంధించి పలు హామీలు లభించాయని చెప్పారు.

**దసరాకు రెండు డీఏలు.. సంక్రాంతికి మరో డీఏ**

ఉద్యోగుల డీఏ బకాయిలపై ప్రభుత్వం స్పష్టమైన హామీ ఇచ్చిందని జేఏసీ చైర్మన్ తెలిపారు. వచ్చే నెల దసరా సందర్భంగా రెండు డీఏలను విడుదల చేయడంతో పాటు సంక్రాంతి నాటికి మరో డీఏను విడుదల చేస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చిందన్నారు.

**సీపీఎస్‌పై ప్రత్యేక కమిటీ**

కాంట్రిబ్యూటరీ పెన్షన్ విధానం (సీపీఎస్)పై ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేసి, మూడు నెలల్లోగా నివేదిక అందేలా ప్రక్రియ చేపడతామని ప్రభుత్వం హామీ ఇచ్చిందని తెలిపారు. ఉద్యోగుల దీర్ఘకాలిక ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ఈ అంశాన్ని ప్రభుత్వం పరిశీలిస్తుందని చెప్పారు.

**పీఆర్‌సీ, ఈహెచ్‌ఎస్‌పై వేగంగా చర్యలు**

ఉద్యోగుల వేతన సవరణకు సంబంధించిన పీఆర్‌సీ కమిటీ నివేదికను త్వరితగతిన పరిశీలించి తుది నిర్ణయం తీసుకుంటామని ప్రభుత్వం హామీ ఇచ్చిందని మారం జగదీశ్వర్ తెలిపారు. అలాగే ఉద్యోగుల ఆరోగ్య భద్రతకు సంబంధించిన ఈహెచ్‌ఎస్ ప్రక్రియను వేగవంతం చేసి, మరింత పకడ్బందీగా ఆరోగ్య సేవలు అందేలా చర్యలు తీసుకుంటామని ప్రభుత్వం హామీ ఇచ్చిందన్నారు.

ప్రభుత్వం ఇచ్చిన హామీలను నిర్ణీత కాలంలో అమలు చేయాలని తెలంగాణ రాష్ట్ర ఉద్యోగుల జేఏసీ కోరుతుందని ఆయన స్పష్టం చేశారు. ఉద్యోగుల న్యాయమైన సమస్యల పరిష్కారం కోసం జేఏసీ నిరంతరం కృషి చేస్తుందని తెలిపారు.

**సీఎంకు ఉద్యోగుల జేఏసీ స్వాగతం**

ఈ నెల 30న ముఖ్యమంత్రి కరీంనగర్ జిల్లా నూతన కలెక్టరేట్ కార్యాలయ ప్రారంభోత్సవానికి హాజరు కానున్నారని మారం జగదీశ్వర్ తెలిపారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ఉద్యోగుల జేఏసీ పక్షాన ముఖ్యమంత్రికి హృదయపూర్వక స్వాగతం పలికేందుకు ఉద్యోగ సంఘాల నాయకులు, జేఏసీ ప్రతినిధులు పెద్ద సంఖ్యలో హాజరుకావాలని ఆయన కోరారు.ఈ సమావేశంలో కరీంనగర్ జిల్లా ఉద్యోగుల జేఏసీ చైర్మన్ దారం శ్రీనివాస్ రెడ్డి, కన్వీనర్ మడిపల్లి కాళీచరణ్, టీఎన్జీవోల సంఘం కార్యదర్శి సంగెం లక్ష్మణ్ రావు, కోశాధికారి కిరణ్ కుమార్ రెడ్డి, గెజిటెడ్ అధికారుల సంఘం జిల్లా కార్యదర్శి డాక్టర్ అరవింద్ రెడ్డి, పెన్షనర్ల సంఘం నాయకులు పెండ్యాల కేశవరెడ్డి, ప్రభాకర్ రావు, టీఎన్జీవోల సంఘం రాష్ట్ర నాయకులు రాగి శ్రీనివాస్, సర్దార్ హర్మిందర్ సింగ్, ప్రభాకర రెడ్డి, రమేష్ గౌడ్, ప్రసాద్ రెడ్డి, రాజేష్ భరద్వాజ్, వెలిచాల సుమంత్ రావు, మామిడి రమేష్, పోలు కిషన్, శారద, సునీత, సరిత, సూర్య, శైలజ, అజ్గర్ అలీ, వారీస్ నవాబ్, రాజేశ్వర రావు, శంకర్ తదితర ఉద్యోగ సంఘాల నాయకులు, జేఏసీ ప్రతినిధులు, టీఎన్జీవోల సంఘం నాయకులు పాల్గొన్నారు.



# వైభవంగా గణేష్ నిమజ్జన శోభాయాత్ర

- ప్రజాప్రతినిధులు, అధికారుల తుది పూజలు
- వినాయక్ చౌక్ లో శోభాయాత్రను ప్రారంభించిన అతిథులు

**ఆదిలాబాద్ మహా:** ఆదిలాబాద్ పట్టణంలో హిందూ సమాజ్ ఉత్సవ సమితి, ఎదులాపురం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గణేష్ నిమజ్జన సార్వజనిక శోభాయాత్ర శుక్రవారం వినాయక్ చౌక్ నుంచి భక్తిశ్రద్ధల మధ్య వైభవంగా ప్రారంభమైంది.ప్రజా ప్రతినిధులు జిల్లా కలెక్టర్ రాజర్షి షా, ఎస్పీ అఖిల్ మహాజన్ తదితరులు గణేషుడికి తుది పూజలు నిర్వహించి శోభాయాత్రను ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎంపీ గోడం నగేష్ మాట్లాడుతూ, గణేష్ ఉత్సవాలు కేవలం పండుగలకే పరిమితం కాకుండా సమాజంలో ఐక్యత, భక్తిభావం, సోదరభావాన్ని పెంపొందించే గొప్ప సాంస్కృతిక సంప్రదాయమన్నారు. జిల్లాలో భక్తిశ్రద్ధలతో నిర్వహించిన గణేష్ ఉత్సవాలను నిమజ్జన కార్యక్రమంతో అదే భక్తిభావంతో పూర్తి చేసుకోవాలని కోరారు. శోభాయాత్రలో సంప్రదాయ వాయిద్యాలకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు.జిల్లా కలెక్టర్ రాజర్షి షా మాట్లాడుతూ, గణేష్ నిమజ్జన శోభాయాత్రకు సంబంధించి అన్ని శాఖల అధికారులు సమన్వయంతో అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేశారని తెలిపారు. ఉత్సవ కమిటీ నిర్వాహకులు సూచించిన రోడ్లు, విద్యుత్ తదితర సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు చేపట్టామన్నారు. మున్సిపాలిటీ ద్వారా గత ఏడాది కంటే అధికంగా రూ.37 లక్షలు, సీసీ కెమెరాల నిర్వహణకు రూ.25 లక్షలు, రోడ్డు మరమ్మతులకు రూ.5 లక్షలు కేటాయించినట్లు తెలిపారు. గణేష్ ఉత్సవాలను డీజేలకు దూరంగా ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలని సూచించారు. ఎస్పీ అఖిల్ మహాజన్ మాట్లాడుతూ, శోభాయాత్ర ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా ప్రశాంతంగా నిర్వహించేందుకు పోలీస్ శాఖ తరపున అన్ని ముందస్తు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. భక్తులు పోలీసుల సూచనలు, నిబంధనలు పాటిస్తూ పోలీస్ శాఖకు సహకరించాలని కోరారు. మున్సిపల్ ఛైర్‌పర్సన్ బండారి అనూష మాట్లాడుతూ గణేశ్ నవరాత్రి ఉత్సవాలను ప్రజలంతా ప్రశాంత వాతావరణంలో, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా విజయవంతంగా నిర్వహించుకోవాలని కోరారు. వర్షాకాలం కొనసాగుతున్నా ఆశించిన స్థాయిలో వర్షాలు కురవలేదన్నారు. గణనాథుని కృపతో సమృద్ధిగా వర్షాలు కురిసి పట్టణంలో తాగునీటి సమస్యలు తలెత్తకుండా, రైతుల పంటలు సమృద్ధిగా పండాలని ప్రార్థించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ ఛైర్మన్ శ్రీకాంత్ రెడ్డి, హిందూ ఉత్సవ సమితి సభ్యులు లచ్చన్న, ప్రవీణ్, పట్టణ ప్రముఖులు, భక్తులు, అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# కేంద్ర ఎన్నికల సంఘం చీఫ్ ఎలక్షన్ కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌ను తొలగించాలి

- భారత రాజ్యాంగ వ్యవస్థను నిర్వీర్యం చేసే కుట్ర : సిర్పంగి స్వామి
- సిపిఎం మండల కార్యదర్శి డిమాండ్..




**వలిగొండ సెప్టెంబర్ 25 మహా న్యూస్:** దేశవ్యాప్తంగా 13 కోట్ల మంది ఓటర్ల ఓటు చోరీకి పాల్పడిన కేంద్ర ఎన్నికల సంఘం చీఫ్ ఎలక్షన్ కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ ను వెంటనే ఆ పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేస్తూ సిపిఎం వలిగొండ మండల కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం మండల కేంద్రంలోని రాస్తారోకో కార్యక్రమాన్ని నిర్వహించారు . ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి సిర్పంగి స్వామి మాట్లాడుతూ ఓటు ప్రజాస్వామ్యానికి పునాది అని ప్రతి పౌరుడి హక్కు అని పౌరుల హక్కులను కాపాడవలసిన బాధ్యత ఎన్నికల సంఘంపై ఉందని తెలిపారు అలాంటి బాధ్యతాయుతమైన ఎన్నికల సంఘం చీఫ్ ఎలక్షన్ కమిషనర్ గా బాధ్యత వహిస్తున్న జ్ఞానేష్ కుమార్ భారత రాజ్యాంగ వ్యవస్థను నిర్వీర్యం చేసేందుకు కేంద్ర బిజెపి ప్రభుత్వంతో కుమ్మక్కై ఎన్నికల కమిషన్ లో సభ్యులుగా ఉన్న సుఖ్ బీర్ సింగ్ సంధు, వివేక్ జోషిలు 14 సార్లు సర్ ఎన్నికల ప్రక్రియపై అభ్యంతరాలు చెప్పిన జ్ఞానేష్ కుమార్ వాటిని ఖాతార్ చేయకుండా నిరంకుశత్వంతో వ్యవహరించాడన్నారు కొత్త ఓటర్ల నమోదు, ఓటర్ల పేర్ల తొలగింపు, ఓటర్ల డేటా బేస్ ,ఎన్నికల నిర్వహణ, ఎన్నికల జాబితా సాఫ్ట్వేర్ సంబంధించిన అంశాలపై ఇద్దరు సభ్యులు అభ్యంతరాలు చెప్పిన వాటిని పక్కన పెట్టి కేంద్ర ప్రభుత్వానికి ఎన్నికల ఏజెంటుగా వ్యవహరించిన జ్ఞానేశ్ కుమార్ కు ఎన్నికల చీఫ్ కమిషనర్ గా కొనసాగే అర్హత లేదన్నారు ఆయనను వెంటనే ఆ పదవి నుండి కేంద్ర ప్రభుత్వం తొలగించాలని డిమాండ్ చేశారు ఎన్నికల సంఘం స్వతంత్రతను ప్రజాస్వామ్య పద్ధతిలో దాని కార్యకలాపాలను పునరుద్ధరించాల్సిన అవసరం ఉందని సుప్రీంకోర్టు గతంలో సూచించిన విధంగా ప్రధానమంత్రి, ప్రతిపక్షనేత, సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తితో కూడిన కమిటీ ద్వారా ఎన్నికల కమిషనర్లను నియమించే విధానాన్ని తీసుకురావాలని ప్రస్తుతం కొనసాగుతున్న విధానాన్ని మార్చాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి వర్గ సభ్యులు మెరుగు వెంకటేశం, కూర శ్రీనివాస్, కందడి సత్తిరెడ్డి, వాకిటి వెంకటరెడ్డి, సీనియర్ నాయకులు కొమ్మిడి లక్ష్మారెడ్డి, మండల కమిటీ సభ్యులు కల్కూరి రామచంద్రర్, దుబ్బ లింగం, నాయకులు కొండూరు సత్తయ్య, వేముల లక్ష్మయ్య,శీలం ఇందిర,చేగూరి నరసింహ, చేగూరి నగేష్, వేముల అమరేందర్, గంగాపురం వెంకటేశం,పోలేపల్లి ఉప్పలయ్య,సలిగంజి రాజయ్య,రుద్రపల్లి రామలింగం,కోరబోయిన మహేందర్,మైసొల్ల నరేందర్, కందుల మత్స్యగిరి,సంగపాక నవీన్,గణేష్, తదితరులు పాల్గొన్నారు



# ఈనెల 27న చలో యాదగిరిగుట్ట

- జోగు అంజయ్య ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షులు

**భువనగిరి మహా న్యూస్ :** తెలంగాణ ఉద్యమకారుల ఫోరం 9వ ఆవిర్భావ వేడుకలను విజయవంతం చేయాలని ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షులు జోగు అంజయ్య ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు ఉద్యమకారుల ఫోరం ఉద్యమకారుల న్యాయమైన డిమాండ్లు నెరవేర్చాలని గత తొమ్మిది సంవత్సరాల క్రితం వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ చీమ శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఏర్పడి రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమకారులను కదిలించి ప్రభుత్వానికి ఉద్యమకారుల మధ్య వారధిగా ఉద్యమకారుల ఫోరం పని చేస్తుందని అన్నారు ఈ నెల 27న జరిగే ఆవిర్భావ వేడుకలకు రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య ఉద్యమకారుల గుర్తింపు కమిటీ సభ్యులు ఎమ్మెల్సీ కోదండరాం అద్దంకి దయాకర్ మోతే శోభన్ రెడ్డి రాములు నాయక్ హాజరవుతున్నట్లు తెలిపారు రాష్ట్రం కోసం ఆనాడు జరిగిన పోరాటంలో అనేకమంది రబ్బర్ బుల్లెట్లను లెక్కచేయకుండా జైలు నిర్బంధాలను ఎదిరించి బలిదానాలను ఇచ్చి రాష్ట్ర ఏర్పాటులో ముఖ్య పాత్ర పోషించిన ఉద్యమకాలందరినీ ప్రభుత్వం వెంటనే గుర్తించి న్యాయం చేయాలని ఆయన డిమాండ్ చేశారు

# పీహెచ్‌సీలో 24/7 వైద్య సేవలు ఎక్కడ?

- ఇష్టానుసారంగా డ్యూటీలు!? ఉన్నతాధికారుల పర్యవేక్షణ కరువు?
- డాక్టర్ల హాజరు స్పష్టత కరువు.. రోస్టర్ ప్రదర్శన ఏదీ?

**పెద్దపల్లి మహా :** కాల్వ శ్రీరాంపూర్ మండలంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్య సేవల నిర్వహణపై రోగులు, స్థానికుల నుంచి తీవ్ర ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఆసుపత్రిలో వైద్యులు అందుబాటులో ఉండటం లేదని, స్టాఫ్ నర్సులే వైద్య సేవలు నిర్వహించాల్సిన పరిస్థితి నెలకొందని రోగులు ఆరోపిస్తున్నారు. అందువల్ల కింది స్థాయి స్టాఫ్ ఇష్టానుసారంగా రోగుల పట్ల వ్యవహరిస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి? డ్యూటీలో ఏ వైద్యుడు ఉంటారో తెలుసుకునే అవకాశం లేకుండా పోయిందని, వైద్య సిబ్బంది రోస్టర్, హాజరు వివరాలను ఆసుపత్రి బోర్డుపై ప్రదర్శించాల్సి ఉన్నప్పటికీ నిబంధనలు పాటించడం లేదని విమర్శలు వస్తున్నాయి. ముఖ్యంగా మధ్యాహ్నం తర్వాత వైద్యులు అందుబాటులో ఉండటం లేదని రోగులు ఆరోపిస్తున్నారు. అత్యవసర కేసులు వచ్చినప్పుడు కాల్ డ్యూటీ వైద్యుడికి సమాచారం అందించిన తర్వాతే వచ్చి చికిత్స అందిస్తున్నారని చెబుతున్నారు. దీంతో అత్యవసర వైద్యం అవసరమైన సమయంలో రోగులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వైద్యులు, సిబ్బంది డ్యూటీ విధివిధానాలు ఏమిటో కూడా స్పష్టం చేయవలసిన అవసరం ఉంది కానీ అది ఎక్కడ కూడా స్పష్టత చేయడం లేదు అని విమర్శలు వినిపిస్తున్నాయి.? అదే విధంగా ఆసుపత్రిలో అవసరమైన మందులు అందుబాటులో లేకపోవడంతో బయట నుంచి మందులు కొనుగోలు చేయాల్సి వస్తోందని రోగులు పేర్కొంటున్నారు. వైద్యం కోసం ఆసుపత్రికి వచ్చే రోగులకు సిబ్బంది నుంచి సరైన స్పందన లభించడం లేదని, కొందరు సిబ్బంది రోగుల పట్ల అసహనం వ్యక్తం చేస్తున్నారని ఆరోపణలు మరియు వైద్యుల డ్యూటీ రోస్టర్, హాజరు పట్టికను ఆసుపత్రిలో స్పష్టంగా ప్రదర్శించాలని, పని వేళల్లో వైద్యులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని రోగులు, స్థానికులు కోరుతున్నారు. అలాగే అవసరమైన మందులను అందుబాటులో ఉంచి, అత్యవసర వైద్య సేవలకు అంతరాయం లేకుండా చూడాలని సంబంధిత అధికారులను విజ్ఞప్తి చేస్తున్నారు. ఈ ఆరోపణలపై ఉన్నతాధికారులు స్పందించి వాస్తవ పరిస్థితిని పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.



# కూచిపూడి చిన్నారి మహాసంకల్పం

**ఆదిలాబాద్ మహా :** అదిలాబాద్ జిల్లా జైనథ్ మండలం బెల్గాం గ్రామానికి చెందిన కూచిపూడి నృత్య కళాకారిణి చిన్నారి గడ్డం శ్రీనిధి 108 పుణ్య క్షేత్రాలలో తన నృత్య ప్రదర్శన చేయాలన్న మహా సంకల్పాన్ని తలపెట్టిందని ఆమె తల్లిదండ్రులు గడ్డం రుచిత రవీందర్ రెడ్డి తో పాటు బాల కేంద్రం పర్యవేక్షకులు మిట్టు రవి తెలిపారు జిల్లా బాల కేంద్రంలోనే కూచిపూడి సర్టిఫికేట్ కోర్స్ చేస్తున్న చిన్నారి శుక్రవారం తన నృత్యానికి పట్టణంలోని దుర్గా నగర్ శ్రీ నవ శక్తి దుర్గా మాత ఆలయంలో శ్రీకారం చుట్టింది.ఆలయ పీఠాధిపతి కిషన్ మహారాజ్ ఆధ్వర్యంలో యజ్ఞం నిర్వహించి అమ్మవారి ఆశీస్సులు అందుకొని పీఠాధిపతి, తల్లిదండ్రులు, బాల కేంద్రం చిన్నారుల సమక్షంలో వినాయక కౌతం, అంబ పరాకు పాటల పై తన మొదటి నృత్య ప్రదర్శనను దిగ్విజయవంతంగా పూర్తి చేసిందని మిట్టు రవి తెలిపారు. ఇలాగే 108 పుణ్య క్షేత్రాలలో తన నృత్య ప్రదర్శన విజయవంతగా పూర్తి చేసుకోవాలని ఆయన ఆకాంక్షించారు.



# ఇండస్ట్రియల్ కారిడార్ లో భూములు కోల్పోయే రైతులకు తగిన న్యాయం చేయాలి

- అధిక ధర వచ్చేలా చూడాలి
- ప్రెస్ మీట్ లో ప్రభుత్వాన్ని కోరిన ఆత్మకమిటీ చైర్మన్ సంతోష్ రావు

**ఆదిలాబాద్ మహా :** ఇండస్ట్రియల్ కారిడార్ లో భూమలు కోల్పోతున్న రైతులను తగిన విధంగా న్యాయం చేయాలని ఆదిలాబాద్ ఆత్మ కమిటీ చైర్మన్ గిమ్మ సంతోష్ రావు కోరారు. శుక్రవారం భోరజ్ మండల కాంగ్రెస్ పార్టీ శ్రేణులతో కలిసి ఆదిలాబాద్ పట్టణంలోని కంది శ్రీనివాస రెడ్డి క్యాంపు కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. భూనిర్వాసితులకు మొదటి ప్రాధాన్యతగా ఇందిరమ్మ ఇండ్లు కేటాయించాలని కోరారు. ఇదే విషయమై ఆదిలాబాద్ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇంచార్జి కంది శ్రీనివాస రెడ్డి ఇంచార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు కు విజ్ఞప్తి చేయడమే కాకుండా జిల్లా కలెక్టర్ కు లేఖ ద్వారా విజ్ఞప్తి చేసారన్నారు. రైతుల భూములకు అధిక మొత్తంలో ధర లభించేలా చూడాలని కోరారు. అలాగే భూనిర్వాసిత కుటుంబాలలోని అర్హులకు ఇండిస్ట్రియల్ కారిడార్ లో తగిన ఉద్యోగాలివ్వాలని కోరారు . ఈ కార్యక్రమంలో భోరజ్ మండల నాయకులు బత్తుల శ్రీనివాస్ , శాంతన్ రావు, సర్పంచ్ వామన్ , ప్రభాకర్ , అశోక్,నిఖిలేష్, నారాయణ రాజీవ్ తదితరులు పాల్గొన్నారు.



# బాధిత కుటుంబానికి ఎల్వోసీ అందజేసిన ఎమ్మెల్యే

- వైద్య ఖర్చుల కోసం రూ.2 లక్షల సీఎంఆర్ఎఫ్ ఎల్ఓసీ అందజేసిన ఎమ్మెల్యే గడ్డం వినోద్

**బెల్లంపల్లి, మహా :** అనారోగ్యంతో బాధపడుతున్న కుటుంబానికి సంబంధిత వైద్య ఖర్చుల నిమిత్తం రెండు లక్షల సీఎమ్ఆర్ఎఫ్ ఎల్ఓసిని ఎమ్మెల్యే గడ్డం వినోద్ అందజేశారు.కన్నెపల్లి మండలం జజ్జరెల్లి గ్రామానికి చెందిన వినోద్ కుమార్ ఇటీవల అనారోగ్య సమస్యతో బాధపడుతూ నిమ్స్ ఆసుపత్రిలో చికిత్సకై చేరారు. . వైద్య చికిత్సకు సుమారు రూ.2 లక్షల వరకు ఖర్చు అవుతుందని వైద్యులు కుటుంబ సభ్యులకు తెలియజేయగా సంబంధిత విషయాన్ని కుటుంబ సభ్యులు ఎమ్మెల్యే గడ్డం వినోద్ దృష్టికి తీసుకెళ్లగా, ఆయన వెంటనే స్పందించి ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా వైద్య ఖర్చుల కోసం రూ.2 లక్షల ఎల్ఓసీ (మంజూరు చేయించి కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులు మాట్లాడుతూ తమ కష్టకాలంలో విషయాన్ని తెలుసుకున్న వెంటనే స్పందించి వైద్య చికిత్సకు ఆర్థిక సహాయం అందించిన ఎమ్మెల్యే గడ్డం వినోద్ కి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఆపదలో ఉన్న ప్రతి ఒక్కరికీ అండగా నిలుస్తూ పేదల సంక్షేమమే లక్ష్యంగా ముందుకు సాగుతున్న నాయకుడిగా ఎమ్మెల్యే గడ్డం వినోద్ నియోజకవర్గ ప్రజల మన్ననలు పొందుతున్నారు. నియోజకవర్గంలో ఇప్పటివరకు అనేక మంది నిరుపేదలు, అనారోగ్యంతో బాధపడుతున్న కుటుంబాలకు వివిధ సందర్భాల్లో అండగా నిలిచిన ఎమ్మెల్యే సేవలు ప్రజలకు భరోసాను కల్పిస్తున్నాయని కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పేర్కొంటున్నారు.



# మాసబ్ చెరువు వద్ద ఘనంగా వినాయక నిమజ్జనం..

- ఏర్పాట్లను పరిశీలించిన ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి
- భక్తులు అధికారులకు సహకరించి నిమజ్జనం ప్రశాంతంగా జరుపుకోవాలి..
- ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి.

**ఆదిభట్ల సెప్టెంబర్ 26 మహా:** రంగారెడ్డి జిల్లా జిహెచ్ఎంసి ఆదిభట్ల సర్కిల్ తుర్కయంజాల్ డివిజన్ పరిధిలోని ప్రసిద్ధ మాసబ్ చెరువు వద్ద జరుగుతున్న వినాయక నిమజ్జన ఏర్పాట్లను ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అనంతరం చెరువు వద్ద జరుగుతున్న నిమజ్జన కార్యక్రమాల్లో ఆయన స్వయంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి మాట్లాడుతూ.. గణేష్ నిమజ్జన వేడుకల కోసం కోహెడ, ఇంజాపూర్, వనస్థలిపురం, హస్తినాపురం, మీర్‌పేట్, హయత్‌నగర్, ఎల్బీనగర్, అబ్దుల్లాపూర్ మెట్ తో పాటు పరిసర ప్రాంతాల నుంచి గణనాథులు భారీ సంఖ్యలో మాసబ్ చెరువు వద్దకు తరలివస్తున్నారని తెలిపారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ప్రభుత్వం తరపున అన్ని మౌలిక వసతులు, భారీ బందోబస్తు మరియు ముందస్తు ఏర్పాట్లను పకడ్బందీగా పూర్తి చేశామని ఆయన స్పష్టం చేశారు. నిమజ్జనానికి వచ్చే భక్తులందరూ పోలీసు, రెవెన్యూ, మున్సిపల్ అధికారులకు సహకరిస్తూ, వేడుకలను శాంతియుతంగా, భక్తిశ్రద్ధలతో విజయవంతం చేయాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు.

# నర్సింగ్ విద్యార్థిని మృతిపై సమగ్ర దర్యాప్తు చేయాలి

**కారేపల్లి, మహా:** ఖమ్మం నర్సింగ్ కళాశాలలో విద్యనభ్యసిస్తున్న ఇంద్రపల్లి హరిణి (18) మృతికి కారణమైన వారిని గుర్తించి వెంటనే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని ఐద్వా మండల కార్యదర్శి కొండబోయిన ఉమావతి డిమాండ్ చేశారు. శుక్రవారం కారేపల్లిలో ఆమె విలేకరులతో మాట్లాడుతూ జూలూరుపాడు మండలం వెంకటాపురంలో బాత్రూమ్ వెనుక హరిణి మృతదేహం లభించిందన్నారు. మృతదేహంపై గాయాలు, రక్తపు మరకలు, చిరిగిన దుస్తులు ఉండటంతో అనుమానాలు వ్యక్తమవుతున్నాయని తెలిపారు. ఘటనపై పోలీసులు నిష్పక్షపాతంగా సమగ్ర దర్యాప్తు చేసి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.



# నిమజ్జనానికి పటిష్ట బందోబస్తు

**ఆదిలాబాద్ మహా:** గణపతి నిమజ్జనోత్సవాలు ప్రశాంతంగా జరిగేలా జిల్లా పోలీసు యంత్రాంగం పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసిందని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు. శుక్రవారం కమాండ్ కంట్రోల్ సెంటర్ ద్వారా సిసి టీవీ కెమెరాలను పరిశీలిస్తూ నిమజ్జన కార్యక్రమాల భద్రతా ఏర్పాట్లను ఎస్పీ పర్యవేక్షించారు. నిమజ్జన బందోబస్తులో 600 మంది పోలీసు సిబ్బందిని మోహరించి, పట్టణాన్ని 13 క్లస్టర్లు, 13 సెక్టార్లుగా విభజించారు. 23 పికెట్లు, రూఫ్‌టాప్ బందోబస్తు, హైవే పెట్రోలింగ్, రెండు స్ట్రైకింగ్ ఫోర్స్‌లను ఏర్పాటు చేశారు. మఫ్టీ పోలీసు బృందాలు, స్పెషల్ బ్రాంచ్ సిబ్బందితో ప్రత్యేక నిఘా కొనసాగుతోంది. పట్టణంలో ఏర్పాటు చేసిన 600 సీసీటీవీ కెమెరాలతో పాటు డ్రోన్ కెమెరా ద్వారా పరిస్థితులను నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. పెన్గంగా, చాందటి నిమజ్జన ప్రదేశాల్లో ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేశారు. పోలీసు సిబ్బంది అప్రమత్తంగా ఉంటూ ప్రజలతో ఓపికగా, ప్రశాంతంగా వ్యవహరించాలని ఎస్పీ సూచించారు. నిమజ్జనోత్సవాల్లో డీజేలు, లేజర్ లైట్లు, పేపర్ సెల్ యంత్రాలకు అనుమతి లేదని తెలిపారు. ప్రజలు పోలీసులకు సహకరిస్తూ, పిల్లలను జాగ్రత్తగా చూసుకుంటూ నిమజ్జన కార్యక్రమాలను ప్రశాంతంగా పూర్తి చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీలు పి మౌనిక ఐపీఎస్, బి సురేందర్ రావు, ఉట్నూర్ ఎఎస్పీ రుత్విక్ సాయి కొట్టే ఐపీఎస్, డీఎస్పీలు ఎల్ జీవన్ రెడ్డి, ఎం వెంకట నర్సయ్య, సిఐలు, ఎస్సైలు పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.




# పోలీస్ స్టేషన్ ఆవరణలో ఇరువర్గాల మధ్య ఘర్షణ

- పోలీసుల విధులకు ఆటంకం కలిగించిన ఇరువర్గాలపై కేసులు
- అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలింపు




**భద్రాద్రి కొత్తగూడెం, మహా:** గణేష్ నిమజ్జన బందోబస్తు విధుల్లో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పోలీసు సిబ్బంది నిమగ్నమై ఉన్న సమయంలో శుక్రవారం కొత్తగూడెం పోలీస్ స్టేషన్ ఆవరణలో కుటుంబ వివాదానికి సంబంధించి పోలీస్ స్టేషన్‌కు వచ్చిన ఇరువర్గాల మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. పరస్పరం దూషించుకోవడంతో పాటు దాడులకు పాల్పడటమే కాకుండా విధుల్లో ఉన్న పోలీసు సిబ్బందిని నెట్టివేసి వారి విధులకు ఆటంకం కలిగించిన ఘటనపై పోలీసులు చట్టపరమైన చర్యలు చేపట్టారు. కొరదల కుమార్ అతని భార్య వినోదకు సంబంధించిన కుటుంబ వివాదం నేపథ్యంలో ఇరువర్గాల వారు కొత్తగూడెం పోలీస్ స్టేషన్‌కు వచ్చారు. ఈ క్రమంలో మాటామాట పెరిగి పరస్పరం దూషించుకోవడంతో పాటు ఒకరిపై ఒకరు దాడులకు పాల్పడ్డారు. ఈ ఘటనలో దున్నపోతుల రాజు అనే వ్యక్తిపై ఇటుక రాయితో దాడి చేయడంతో ముక్కుపై రక్తగాయం అయినట్లు ఫిర్యాదు అందింది. అలాగే వెంకటమల్లు అనే మహిళను కొంతమంది వ్యక్తులు జుట్టు పట్టుకుని చేతులతో కొట్టినట్లు మరో ఫిర్యాదు అందింది. ఇరువర్గాల మధ్య పరస్పరం బెదిరింపులు దూషణలు జరిగినట్లు ఫిర్యాదుల్లో పేర్కొన్నారు. ఘర్షణను అదుపు చేసే క్రమంలో విధులు నిర్వహిస్తున్న పోలీసు అధికారులను సైతం ఇరువర్గాల వారు నెట్టివేసి పోలీస్ స్టేషన్ ప్రాంగణంలో వారి విధులకు ఆటంకం కలిగించడం జరిగింది. ఈ ఘటనపై అందిన ఫిర్యాదుల మేరకు కేసులు నమోదు చేసి సంబంధిత వ్యక్తులను అదుపులోకి తీసుకుని అరెస్ట్ చేసి న్యాయస్థానంలో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించారు. ఈ సందర్భంగా కొత్తగూడెం డీఎస్పీ ఆదినారాయణ మాట్లాడుతూ పోలీస్ స్టేషన్ ప్రాంగణంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించడం విధుల్లో ఉన్న పోలీసు సిబ్బందికి ఆటంకం కలిగించడం వంటి చర్యలను తీవ్రంగా పరిగణిస్తామని తెలిపారు. చట్టాన్ని అతిక్రమించే వారిపై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.



# బొల్లం కృష్ణ మృతికి కారణమైన... రాంకీపై చర్యలు తీసుకోవాలి

- డంపింగ్ యార్డ్ తోనే... ప్రజల ప్రాణాలు గాల్లో కలుస్తున్నాయి.
- తక్షణమే బాధిత కుటుంబానికి ఎక్స్ గ్రేషియా ప్రకటించాలని డిమాండ్.
- అంబేద్కర్ చౌరస్తాలో ప్రజాసంఘాల నాయకుల నిరసన



**జవహర్ నగర్, మహా :** డంపింగ్ దుర్వాసనతోనే శ్వాసకోస సమస్యలతో అనారోగ్యానికి గురై మరణించిన బొల్లం కృష్ణ మృతి ముమ్మాటికి రాంకీ యాజమాన్యం పరోక్షంగా చేసిన హత్యనేనని ప్రజాసంఘాల నాయకులు ఆరోపించారు. శ్వాసకోస అవస్థతో చికిత్స పొందుతూ గాంధీ దావఖానాలో మృతి చెందిన బొల్లం కృష్ణ మరణాన్ని నిరసిస్తూ రాంకీ యాజమాన్యంపై హత్యా నేరం కేసు నమోదు చేయాలని కోరుతూ నందమూరి నగర్ లో వైయస్సార్ విగ్రహం ఎదుట శుక్రవారం ప్రజాసంఘాల ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ప్రజాసంఘాల నాయకులు మాట్లాడుతూ ప్రజాస్వామికంగా లాభాపేక్షతో వ్యాపారాలు చేస్తూ ప్రజల జీవితాలను నాశనం చేస్తున్న రాంకీ యాజమాన్యాన్ని వెంటనే అరెస్టు చేసి బొల్లం కృష్ణ కుటుంబాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఆల్వాల్ సర్కిల్ ప్రాంతం చెత్తని తీసుకురాకుండా చూస్తామని చెప్పిన రాంకి నేడు మహానగరంలోని చెత్తనంతా ఇక్కడికి తీసుకువస్తూ డంపింగ్ ప్రాంతమంతా విష వాయువులతో నింపివేస్తూ జవహర్ నగర్ ప్రాంతాన్ని విజృంభిస్తుందన్నారు. 15 ఏళ్లుగా శ్వాస కోశ చర్మ గర్భస్రావ వ్యాధులతో మద్యంతరంగా ప్రజలు ప్రాణాలు వదిలిన వారికి రాంకీ యాజమాన్యమే బాధ్యత వహించాలని వ్యాఖ్యానించారు. ఇప్పటికైనా ప్రజల ప్రభుత్వమని గొప్పలు చెప్పుకునే కాంగ్రెస్ ప్రభుత్వం డంపింగ్ సమస్యను పరిష్కారం అయ్యేలా కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. గోల్కొండ కోటలా డంపింగ్ యార్డు మారిందని, ఇకనైనా నలువైపులా చెత్తను తరలించి జవహర్ నగర్ ను స్వేచ్ఛాయుతంగా తీర్చిదిద్దాలని తెలిపారు. బొల్లం కృష్ణ పార్థివ దేహాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కృష్ణ కుటుంబాన్ని రాంకీ యాజమాన్యం, ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఇష్ట షేక్షావలి, సుబ్రహ్మణ్యం, శివ బాబు, సదానందం, వేణు, మల్లేష్, సునీత, సావిత్రి, ప్రవీణ్, జావిద్, యాదగిరి, శారద, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



# జవహర్ నగర్ లో సర్వం లంబోదరమయం

- శంకర తనయ షణ్ముఖ వాహన
- గణనాథుని దర్శించుకున్న... జిల్లా బిఆర్ఎస్ ఇంచార్జ్ మహేందర్ రెడ్డి

**జవహర్ నగర్, మహా** : పార్వతీ పుత్రుడు, మూషిక వాహనుడు, ఆదిమూల మహా గణపతి, అనాధ రక్షకుడు, ఆ కన్నెమూల మహాగణపతియే అని మేడ్చల్ బిఆర్ఎస్ ఇంచార్జ్ చామ కూర మహేందర్ రెడ్డి అన్నారు. బృందావన్ కాలనీలో శుక్రవారం కాలనీవాసులు నెలకొల్పిన గణనాథున్నీ శుక్రవారం దర్శించారు. అనంతం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రసాదాల స్వీకరించారు. అనంతరం మహేందర్ రెడ్డి మాట్లాడుతూ గణనాథుడు ముల్లోకాల్లోనే శక్తివంతమైన దేవుడని ఆదిమూల మహాగణపతి ఆ గణనాథుని దర్శించుకుంటే కష్టాలన్నీ తొలగిపోతాయన్నారు. జవహర్ నగర్ ప్రజల మీద చల్లని చూపులు ఉండాలని ఆ లంబోధరున్ని కోరుకున్నట్టు తెలిపారు. సర్వవిఘ్నాలకు అధిపతి అయిన గణపతి దేవుని పూజిస్తే అష్టైశ్వర్యాలు సిద్ధిస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో జవహర్ నగర్ మాజీ మేయర్ మేకల కావ్య, బిఆర్ఎస్ నాయకులు, మేకల అయ్యప్ప, కూటి కంటి వెంకటేష్ గౌడ్, మూల సోమయ్య గౌడ్, పంతంగి సిద్ధులు యాదవ్, ప్రసాద్ గౌడ్, కార్యకర్తలు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.



# పల్లే ప్యారడైస్ కాలనీలో ఘనంగా వినాయక నిమజ్జనం

**లడ్డును దక్కించుకున్న గోవర్ధన్ రెడ్డి**

**కుషాయిగూడ, మహా :** పల్లే ప్యారడైస్ కాలనీలో వినాయక నిమజ్జన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన గణేశుని లడ్డూ వేలంలో కాలనీ వాస్తవ్యులు శ్రీ బాకారం గోవర్ధన్ రెడ్డి గారు రూ. 3,23,000లకు లడ్డూను దక్కించుకున్నారు. వేలం అనంతరం కాలనీ వాసులు హర్షధ్వానాల మధ్య గణేశుని లడ్డూను గోవర్ధన్ రెడ్డి కి అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం కాలనీ వాసులందరూ వినాయక విగ్రహంతో ఊరేగింపుగా వెళ్లి, భక్తిశ్రద్ధలతో నిమజ్జన కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేశారు.

# వరంగల్ అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించాలి

- సీఎం రేవంత్ రెడ్డికి వినతిపత్రాలు అందజేసిన వరంగల్ ఎంపీ, ఎమ్మెల్యే
- కేంద్రంతో మాట్లాడి నిధులు తీసుకురావాలని విజ్ఞప్తి



**వరంగల్, బ్యూరో మహా ;** హైదరాబాద్ నగరం తర్వాత గ్రేటర్ వరంగల్ నగరానికి ఎంత ప్రాముఖ్యత ఉందో అందరికీ తెలిసిందే. ఈ ప్రాంత అభివృద్ధికి సంబంధించిన పలు కీలక అంశాల పై ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డిని వరంగల్ ఎంపీ డా.కడియం కావ్య, స్టేషన్ఘన్పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రాలు అందజేశారు. కేంద్ర ప్రభుత్వ పరిధిలోని పలు సంస్థలకు కావాల్సిన నిధులను వరంగల్ కు తీసుకురావాలని సీఎంను కోరడం జరిగింది. ఈ సందర్భంగా కాకతీయ యూనివర్సిటీకి పీఎంఉషా నిధులు, వరంగల్ కోటలో పురావస్తు మ్యూజియం అభివృద్ధికి రూ.10 కోట్లు, నైలిట్, సీఐటీడీ కేంద్రాల ఏర్పాటు, పూర్తిస్థాయిలో పాస్‌పోర్ట్ సేవా కేంద్రం కోసం కేంద్రంతో చర్చించాలని విజ్ఞప్తి చేశారు. కాకతీయ యూనివర్సిటీ అభివృద్ధికి పీఎం-ఉషా పథకం కింద ప్రతిపాదించిన నిధులను కేంద్రం నుంచి త్వరగా మంజూరు చేసి విడుదలయ్యేలా చర్యలు తీసుకోవాలని ఎంపీ కావ్య కోరారు. విద్య, పరిశోధన, మౌలిక వసతులను బలోపేతం చేయడంతోపాటు విద్యార్థులు, పరిశోధకులకు మెరుగైన అవకాశాలు కల్పించేందుకు ఈ నిధులు ఉపయోగపడతాయని తెలిపారు.

**పురావస్తు మ్యూజియం అభివృద్ధికి రూ.10 కోట్లు**

ఓరుగల్లు కోటలో పురావస్తు మ్యూజియం అభివృద్ధికి కేంద్ర సాంస్కృతిక శాఖ నుంచి రూ.10 కోట్లు మంజూరు చేయించాలని కోరారు. 1991లో ఏర్పాటైన పాత మ్యూజియం భవనం శిథిలావస్థకు చేరిందని, కొత్త భవన నిర్మాణం 2023 మేలో పూర్తయినా కళాఖండాల తరలింపు, పరిరక్షణ, ప్రదర్శన, భద్రత, వాతావరణ నియంత్రణ వంటి పనులు చేపట్టాల్సి ఉందని వివరించారు. వరంగల్‌లో నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (నైలిట్) కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని కావ్య కోరారు. ఐటీ, ఎలక్ట్రానిక్స్, కృత్రిమ మేధ, సైబర్ సెక్యూరిటీ, ఐఓటీ రంగాల్లో విద్యార్థులు, నిరుద్యోగ యువతకు శిక్షణ, ధ్రువపత్రాలు అందుబాటులోకి వస్తాయని తెలిపారు. సీఐటీడీ కేంద్రం ఏర్పాటుతో ఇంజినీరింగ్, ఐటీఐ, పాలిటెక్నిక్ విద్యార్థులతో పాటు ఎంఎస్ఎంఈలకు ఆధునిక సాంకేతిక శిక్షణ, సాంకేతిక సహకారం అందుతుందని పేర్కొన్నారు.

**పూర్తిస్థాయిలో పాస్‌పోర్ట్ కేంద్రం ఏర్పాటు**

వరంగల్ నగరం లో ప్రస్తుతం ఉన్న పోస్టాఫీస్ పాస్‌పోర్ట్ సేవా కేంద్రం స్థానంలో పూర్తిస్థాయి పాస్‌పోర్ట్ సేవా కేంద్రం ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రిని కోరారు. తత్కాల్ పాస్‌పోర్ట్ సేవల కోసం కరీంనగర్, సికింద్రాబాద్ వెళ్లాల్సి వస్తుండటంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. వరంగల్, హనుమకొండ, కాజీపేట ట్రై సిటీ ప్రాంతంతో పాటు ఉమ్మడి వరంగల్ జిల్లాకు ప్రయోజనం చేకూరేలా కేంద్ర విదేశాంగ శాఖతో మాట్లాడాలని విజ్ఞప్తి చేశారు. వరంగల్ ప్రాంత విద్యార్థులు, యువత, పరిశోధకులు, ప్రజలకు కేంద్ర ప్రభుత్వ సేవలు అందుబాటులోకి తీసుకురావడంతో పాటు కాకతీయుల చారిత్రక వారసత్వ పరిరక్షణకు కేంద్ర సహకారం అందేలా రాష్ట్ర ప్రభుత్వం చొరవ చూపాలని కావ్య కోరారు. ఆమెతో పాటు మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి కూడా సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి నియోజకవర్గ అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని కోరారు. కావ్య ప్రస్తావించిన అంశాల పై సీఎం సానుకూలంగా స్పందించి, సంబంధిత శాఖలతో చర్చించి కేంద్రంతో సమన్వయం చేసుకుంటూ అవసరమైన నిధులు మంజూరయ్యేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు ఆమె తెలిపారు.



# యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

- హనుమకొండ జిల్లా అదనపు కలెక్టర్ ఎన్. రవి

**హనుమకొండ, మహా ;** సంపూర్ణ ఆరోగ్యానికి ప్రతి ఒక్కరూ యోగా సాధన చేయాలని హనుమకొండ జిల్లా అదనపు కలెక్టర్, టూరిజం నోడల్ అధికారి ఎన్. రవి అన్నారు. శుక్రవారం జిల్లా పర్యాటక శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 27వ తేదీన ప్రపంచ పర్యాటక దినోత్సవం పురస్కరించుకొని యోగ కార్యక్రమాన్ని హనుమకొండ జిల్లా కలెక్టరేట్ ప్రాంగణంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా అదనపు కలెక్టర్ ఎన్. రవి ముఖ్య అతిథిగా హాజరై వివిధ శాఖల అధికారులు, యోగా సాధకులు, విద్యార్థులతో కలిసి యోగాసనాలు వేశారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ రవి మాట్లాడుతూ ప్రతిరోజు యోగ సాధన చేయడం వలన ఆరోగ్యంగా ఉంటారని, అదేవిధంగా ఆధునిక జీవనశైలిలో ఒత్తిడి లేకుండా ఉండేందుకు యోగ దోహదపడుతుందన్నారు. యోగ ప్రయోజనాలను ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పర్యాటక శాఖ అధికారి శివాజీ, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ శ్రీనివాస్, ఆయుష్, తదితర శాఖల అధికారులు, సిబ్బంది, వాలంటీర్లు, యోగ సాధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ముగింపు దశకు చేరుకున్న వినాయకుడి నవరాత్రి ఉత్సవాలు

**బ్రాహ్మణ సేవా సమాజ్ ఆధ్వర్యంలో**

**బెల్లంపల్లి, మహా:** వినాయకుడు నవరాత్రి ఉత్సవాలు బెల్లంపల్లి పట్టణంలో ముగింపు దశకు శుక్రవారం నాడు చేరుకున్నాయి బ్రాహ్మణ సేవా సమాజ్ ఆధ్వర్యంలో కాల్టెక్స్ కెమికల్ ప్రాంతంలోని హనుమాన్ ఆలయంలో ప్రతిష్టించిన వినాయకుడి నిమజ్జనం వేడుకలను పెద్ద సంఖ్యలో బ్రాహ్మణ కుటుంబీకులు హాజరై గణపయ్యకు ఘనంగా వీడ్కోలు పలికారు.ఈ సందర్భంగా ప్రత్యేకంగా హోమం తో పాటు ప్రత్యేక పూజలు నిర్వహించి వినాయకుడి నిమజ్జనానికి పట్టణంలోని పురవీధుల గుండా ఊరేగింపు చేశారు. ఈ సందర్భంగా భక్తులు ప్రత్యేకంగా భక్తి గీతాలు ఆలపిస్తూ నృత్యాలు చేస్తూ ముగింపు ఉత్సవాలు జరిగాయి. ఈ కార్యక్రమంలో బ్రాహ్మణ సేవా సమాజ్ అధ్యక్షులు ఎల్కేఎస్. శ్రీనివాస్, సెక్రటరీ రుద్రపట్ల శివకృష్ణ, సలహాదారులు కొమ్మెర లక్ష్మణ్ ,రాంబట్ల హరి శర్మ ,మనోజ్ కుమార్ పాండే తదితరులు పాల్గొన్నారు.

# జర్నలిస్ట్ వనం భాస్కర్ మృతి బాధాకరం

**నివాళులర్పించిన డిసిసి అధ్యక్షుడు అయుబ్, జర్నలిస్టులు**



**వరంగల్, మహా;** వరంగల్ తూర్పు నియోజకవర్గ సీనియర్ జర్నలిస్ట్ వనం భాస్కర్ ఇటీవల అనారోగ్యానికి గురై హైదరాబాదు లో చికిత్స పొందుతూ గురువారం రాత్రి మరణించారు. ఈ విషయం తెలుసుకున్న వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మహమ్మద్ అయుబ్ శుక్రవారం వారి నివాసానికి వెళ్లి ఆయన భౌతిక దేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వరంగల్ తూర్పు జర్నలిస్టులు, వివిధ జర్నలిస్ట్ సంఘాల నాయకులు, యూనియన్ల ప్రతినిధులు, పలువురు రిపోర్టర్స్, పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



# సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిని త్వరగా అందుబాటులోకి తీసుకురావాలి

**పనుల పురోగతిని పరిశీలించిన సీఎంఓ ఉన్నతాధికారులు**

**వరంగల్, ఎంజీఎం మహా ;** వరంగల్ నగరం లో నిర్మాణంలో ఉన్న సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి నిర్మాణ పనుల పురోగతిని రాష్ట్ర ప్రభుత్వ ఉన్నతాధికారులు శుక్రవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, రవాణా, రోడ్లు, భవనాల శాఖ వికాస్ రాజ్, సీఎంవో ముఖ్య కార్యదర్శి ఎన్. శ్రీధర్, సీఎంవో కార్యదర్శి కె. మాణిక్ రాజ్, ఆర్థిక, ప్రణాళిక శాఖ కార్యదర్శి డాక్టర్ గౌరవ్ ఉప్పల్ తదితరులు ఆసుపత్రి నిర్మాణ ప్రాంగణాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో జరుగుతున్న నిర్మాణ పనుల ప్రస్తుత స్థితి, వివిధ విభాగాల నిర్మాణం, మౌలిక వసతులు, విద్యుత్, నీటి సరఫరా తదితర అంశాల పై సంబంధిత అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. నిర్మాణ పనులను క్షుణ్ణంగా పరిశీలించి, ఇప్పటివరకు పూర్తయిన పనుల నాణ్యతను, చేపట్టాల్సిన పనులను ప్రణాళికాబద్ధంగా, సమన్వయంతో పూర్తి చేయాలని సూచించారు. నిర్మాణంలో ప్రతి దశలోనూ నాణ్యతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటిస్తూ, పనుల పురోగతిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించారు. ఆసుపత్రి అందుబాటులోకి వచ్చిన అనంతరం ఉమ్మడి వరంగల్ జిల్లా, పరిసర ప్రాంతాల ప్రజలకు అత్యాధునిక వైద్య సేవలు అందేలా అవసరమైన అన్ని ఏర్పాట్లను సమన్వయంతో చేపట్టాలని ఆదేశించారు. తొలుత నగరానికి విచ్చేసిన రాష్ట్ర ఉన్నత అధికారులకు వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద, హన్మకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ ఉన్నతాధికారులకు పుష్పగుచ్ఛాలు అందించి స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో ఎంజీఎం సూపర్డెంట్, సంబంధిత శాఖల అధికారులు, నిర్మాణ సంస్థ ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

# యెన్కెపల్లి లో ఘనంగా వినాయకుడి నిమజ్జనం

**మొయినాబాద్ మహా:** మున్సిపాలిటీ పరిధిలోని యెన్కెపల్లి గ్రామంలో వినాయక నవరాత్రి ఉత్సవాలు ఘనంగా ముగిశాయి. గ్రామంలోని వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన గణనాథుల విగ్రహాలను భక్తిశ్రద్ధలతో నిమజ్జనానికి తరలించారు. గ్రామంలో ఏర్పాటు చేసిన అన్ని వినాయక విగ్రహాలను ఒకేసారి నిమజ్జనానికి తరలించడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. గణేష్ శోభాయాత్రలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని జై బోలో గణేష్ మహారాజ్ అంటూ నినాదాలు చేశారు. యెన్కెపల్లి మహాగణపతి లడ్డూ ప్రసాదానికి నిర్వహించిన వేలం హోరాహోరీగా సాగింది. చివరకు లడ్డూ ప్రసాదాన్ని సంఘం రమేష్ రూ.10 లక్షల 15 వేలకు దక్కించుకున్నారు. అలాగే జీవన్‌గూడ యెన్కెపల్లి క్రికెట్ టీమ్ లడ్డూను రూ.4 లక్షలకు కైవసం చేసుకుంది. ముదిరాజ్ సంఘానికి చెందిన కావలి సుభాష్ రూ.2 లక్షల 15 వేలకు మరో లడ్డూ ప్రసాదాన్ని సొంతం చేసుకున్నారు. నిమజ్జన శోభాయాత్రలో ట్రాక్టర్ వెంట ట్రాక్టర్‌ను ఏర్పాటు చేసి సుమారు 35 వాహనాలతో గణేష్ విగ్రహాలను తరలించారు. వాహనాలపై ఏర్పాటు చేసిన గణనాథుల విగ్రహాలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. డప్పులు, భజనలు, నృత్యాలతో యువత సందడి చేసింది. 'పెద్దల మాట జగదాటం.. ఆ తరం పెద్దల అడుగుజాడల్లో ఈ తరం యువత' అన్నట్టుగా యెన్కెపల్లి యువత సంప్రదాయాలను కొనసాగిస్తూ ఉత్సవాలను ఘనంగా నిర్వహించడం గ్రామంలో చర్చనీయాంశంగా మారింది. నిమజ్జన కార్యక్రమం ప్రశాంత వాతావరణంలో సాగింది. భక్తులు గణపతి బప్పా మోరియా అంటూ వీడ్కోలు పలికారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు యువత మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు,

# సోనియా గాంధీ నగర్ గణపతి లడ్డూలకు భారీ ధర

**కుషాయిగూడ, మహా :** కుషాయిగూడ డివిజన్ పరిధిలోని సోనియాగాంధీనగర్ ఫేజ్ 1 కమిటీ హాల్‌లో ఏర్పాటు చేసిన గణపతి లడ్డూ వేలంపాటలో భక్తులు ఉత్సాహంగా పాల్గొన్నారు. తొలి లడ్డూను ప్రియా, విశ్వప్రసాద్ రూ.2,05,000కు దక్కించుకున్నారు. ప్రత్యేకంగా గణనాథుడిని అలంకరించారు. 4000 మంది పైగా అన్నదానాన్ని నిర్వహించారు. సోనియా గాంధీ నగర్ కాలనీలో. లడ్డు వేలంపాట మూడు గంటల పాటు కొనసాగింది. సోనియా గాంధీ నగర్ కాలనీకి చెందిన వారి లడ్డూను దక్కించుకున్నారు. దక్కించుకున్న వారికి కాలనీవాసులు అభినందించారు. ఆ గణనాథుడి దీవెనలు ఉండాలని కాలనీవాసులు వేడుకున్నారు. రెండో లడ్డూను కాంచన రామారావు రూ.1,05,000కు వేలంలో దక్కించుకున్నారు. కార్యక్రమంలో కమిటీ అధ్యక్షుడు కుందనపల్లి సిద్ధు రాములు, బాల నర్సింహ, యాదగిరి, కిట్టు, వెల్డింగ్ శ్రీను, యాదవ్, మల్లేష్ రాజు, శ్రీనివాస్, బంకు శ్రీను, డేవిడ్, అశోక్, వెంకట్ ముదిరాజ్, గంగాధర్, ఏ.సిద్ధు తదితరులు పాల్గొన్నారు.



# వినాయకుడి ఆశీర్వాదాలతో నియోజకవర్గ ప్రజలు సంతోషంగా ఉండాలి

**.. బెల్లంపల్లి మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య**

**బెల్లంపల్లి, మహా :** వినాయక నవరాత్రి ఉత్సవాల ముగింపు సందర్భంగా బెల్లంపల్లి మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య నియోజకవర్గం ప్రజలందరూ సంతోషంగా ఉండాలని వినాయకుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. శుక్రవారం రోజు బెల్లంపల్లి కాల్‌టెక్స్ కెమికల్ ప్రాంతంలోని హనుమాన్ మందిరంలో గణేష్ నవరాత్రుల ముగింపు వేడుకలు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించగా వేడుకలకు హాజరైయ్యారు.ఈ సందర్భంగా నిర్వహించిన గణపతి సహస్రనామ అభిషేకం, పవిత్ర హోమం, అన్నదాన కార్యక్రమాల్లో బెల్లంపల్లి నియోజకవర్గ మాజీ శాసనసభ్యులు దుర్గం చిన్నయ్య పాల్గొని విఘ్నేశ్వరుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.వేద మంత్రోచ్ఛారణలు, గణపతి నామస్మరణలతో ఆలయ ప్రాంగణం ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది.భక్తిమయ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని గణనాథుని కృపాకటాక్షాలను పొందారు. బెల్లంపల్లి నియోజకవర్గ ప్రజలపై గణపయ్య కృప ఎల్లవేళలా ఉండాలని, విఘ్నాలు తొలగించి విజయాలు ప్రసాదించాలని, ప్రతి ఇంటా ఆయురారోగ్యాలు,ఐశ్వర్యాలు, సుఖసంతోషాలు నిండాలని దుర్గం చిన్నయ్య గణనాథుని ప్రార్థించారు.



# తాళ్ల మల్లేశం, కుసుమ జయలక్ష్మి చిత్రపటాలకు నివాళులు అర్పించిన గుండు సుధారాణి

**వరంగల్, మహా :** తాళ్ల పద్మావతి విద్యా సంస్థల అధినేత కీ.శే తాళ్ల మల్లేశం ఇటీవల మృతి చెందిన శుక్రవారం కాకతీయ అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ చైర్ పర్సన్ గుండు సుధారాణి వారి నివాసానికి వెళ్లి వారి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించి, వారి కుమారులు తాళ్ల వంశీ, తాళ్ల వరుణ్ తో పాటు కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం వ్యాపారవేత్త కుసుమ కేదారి కె.కె సిమెంట్ అండ్ ఐరన్ మర్చంట్ మాతృమూర్తి అయిన కీ.శే కుసుమ జయలక్ష్మి ఇటీవల మృతి చెందినందున గుండు సుధారాణి దూపకుంట లోని వారి నివాస గృహానికి వెళ్లి వారి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించి, కుటుంబ సభ్యులను పరామర్శించారు.ఈ కార్యక్రమంలో పద్మశాలి సంఘం వరంగల్ ఉమ్మడి జిల్లా కోఆర్డినేటర్ వడ్నాల నరేందర్, తాజా మాజీ కార్పొరేటర్ గుండు చందన పూర్ణచందర్, నగర కాంగ్రెస్ కార్యదర్శి జినుక రమేష్, నాగమయ్య గుడి ధర్మకర్త శంకేసి అనిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

08 మహా పత్రిక
WWW.MAHAADAILY.COM | సినిమా వార్తలు | MOVIE NEWS | శనివారం, హైదరాబాద్ | 26-09-2026

# చీరకట్టులో మెరిసిన ప్రియాంక మోహన్

**హైదరాబాద్, మహా:** హీరోయిన్ ప్రియాంక మోహన్ తన తాజా ఫొటోషూట్‌తో అభిమానులను ఆకట్టుకుంటున్నారు. సినిమాల్లో ఆధునిక పాత్రల్లో కనిపించే ఈ అందాల భామ తాజాగా సంప్రదాయ చీరకట్టులో దర్శనమిచ్చారు. ఈ ఫొటోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారడంతో అభిమానులు ఆమె లుక్‌పై ప్రశంసలు కురిపిస్తున్నారు.చీరలో ప్రియాంక మోహన్ ఎంతో హుందాగా కనిపించారు. సింపుల్‌గా ఉన్న చీరకు సరిపోయేలా నగలు, మేకప్, హెయిర్‌స్టైల్‌ను ఎంపిక చేసుకోవడంతో ఆమె లుక్‌కు మరింత అందం వచ్చింది. కెమెరా ముందు వివిధ రకాల పోజులతో ఫొటోషూట్ చేసిన ఆమె సంప్రదాయ వస్త్రధారణలోనూ తన గ్లామర్‌ను ప్రదర్శించారు. ముఖ్యంగా ఎలాంటి హంగామా లేకుండా సహజమైన అందంతో కనిపించడం ఈ ఫొటోలకు ప్రత్యేక ఆకర్షణగా మారింది. ప్రియాంక మోహన్ సినిమాలతో పాటు సోషల్ మీడియాలోనూ మంచి ఫాలోయింగ్ సంపాదించుకున్నారు. ఆమె ఫొటోలు, వీడియోలకు అభిమానుల నుంచి తరచూ మంచి స్పందన లభిస్తుంటుంది. తాజాగా విడుదలైన చీర ఫొటోలు కూడా నెటిజన్ల దృష్టిని ఆకర్షిస్తున్నాయి. పలువురు అభిమానులు ప్రియాంక సంప్రదాయ లుక్‌ను అభినందిస్తూ కామెంట్లు చేస్తున్నారు. మరోవైపు ప్రియాంక మోహన్ ప్రస్తుతం తెలుగు, తమిళ చిత్రాలతో బిజీగా ఉన్నారు. విభిన్న కథలు, పాత్రలను ఎంచుకుంటూ నటిగా తన పరిధిని విస్తరించేందుకు ప్రయత్నిస్తున్నారు. తాజా ఫొటోషూట్‌తో మరోసారి తన స్టైల్, అందంతో అభిమానులను అలరించారు.



# రియా చక్రవర్తి సందడి

ముంబై, మహా: బాలీవుడ్ నటి రియా చక్రవర్తి తాజా ఫొటోషూట్‌లో తన ప్రత్యేకమైన ఫ్యాషన్ స్టైల్‌తో ఆకట్టుకున్నారు. సహజమైన రంగులు, సింపుల్ స్టైలింగ్‌కు ప్రాధాన్యమిస్తూ ఆమె చేసిన ఈ ఫొటోషూట్‌కు సంబంధించిన చిత్రాలు ప్రస్తుతం అభిమానుల దృష్టిని ఆకర్షిస్తున్నాయి. మట్టి రంగులను తలపించే డస్టీ రోజ్ షేడ్ దుస్తుల్లో రియా కొత్త లుక్‌లో కనిపించారు. రియా ధరించిన టెక్చర్డ్ దుస్తులకు నడుము వద్ద సిల్వర్ స్టేట్‌మెంట్ బెల్ట్‌ను జత చేశారు. చేతులకు గోల్డ్ బ్యాంగిల్స్, సహజమైన మేకప్, పొడవాటి జుట్టుతో ఆమె లుక్‌ను పూర్తి చేశారు. ఇటుక గోడను బ్యాక్‌డ్రాప్‌గా ఎంచుకోవడంతో ఫొటోలకు మరింత రస్టిక్ ఫీల్ వచ్చింది. సాధారణమైన దుస్తుల్లోనూ స్టైలిష్‌గా కనిపించేలా చేసిన ఈ ఫొటోషూట్ సోషల్ మీడియాలో చర్చనీయాంశంగా మారింది. రియా చక్రవర్తి సినిమాలతో పాటు ఫ్యాషన్, సోషల్ మీడియా ద్వారా కూడా ప్రేక్షకులకు దగ్గరగా ఉంటున్నారు. 'మేరే డాడ్ కీ మారుతి', 'హాఫ్ గర్ల్‌ఫ్రెండ్', 'జలేబీ', 'చెహ్రే' వంటి చిత్రాల్లో నటించిన ఆమె టెలివిజన్ కార్యక్రమాల్లోనూ కనిపించారు. ప్రస్తుతం కొత్త ప్రాజెక్టులతో తన కెరీర్‌లో మరో దశకు సిద్ధమవుతున్నారు.





# ఓటీటీలోకి నయనతార 'హాయ్'

**చెన్నై, మహా:** నయనతార, కవిన్ జంటగా నటించిన 'హాయ్' చిత్రం డిజిటల్ స్ట్రీమింగ్‌కు వచ్చేసింది. ఆగస్టు 28న థియేటర్లలో విడుదలైన ఈ రొమాంటిక్ ఎంటర్‌టైనర్ సెప్టెంబర్ 25 నుంచి జీ5లో స్ట్రీమింగ్ అవుతోంది. విష్ణు ఎడవన్ దర్శకత్వం వహించిన ఈ చిత్రం ద్వారా ఆయన దర్శకుడిగా పరిచయమయ్యారు. ప్రేమ, కుటుంబ పరిస్థితులు, వ్యక్తిగత నిర్ణయాలు, భావోద్వేగ సంఘర్షణలను మేళవిస్తూ 'హాయ్' కథ సాగుతుంది. ప్రేమలో వరుసగా ఎదురుదెబ్బలు తిన్న యువకుడి పాత్రలో కవిన్ కనిపించగా.. కుటుంబ నిర్ణయాలను కాదని తన జీవితంపై తానే నిర్ణయం తీసుకోవాలనుకునే యువతి పాత్రలో నయనతార నటించారు. ఇద్దరి జీవితాలు అనుకోకుండా కలిసిన తర్వాత వారి మధ్య ఏర్పడే అనుబంధం కథకు ప్రధానంగా నిలుస్తుంది. రాధిక శరత్‌కుమార్, ప్రభు, దివంగత నటుడు కే. భాగ్యరాజ్, వీవీ గణేష్, సత్యన్ తదితరులు కీలక పాత్రల్లో నటించారు. జెన్ మార్టిన్ సంగీతం అందించగా, రాజేష్ శుక్లా సినిమాటోగ్రఫీ, ఫిలోమిన్ రాజ్ ఎడిటింగ్ బాధ్యతలు ర్వహించారు.

థియేటర్లలో సినిమా చూడలేకపోయిన ప్రేక్షకులకు ఇప్పుడు ఓటీటీ ద్వారా 'హాయ్'ను చూసే అవకాశం లభించింది. ముఖ్యంగా నయనతార, కవిన్ తొలిసారి కలిసి నటించిన చిత్రం కావడంతో ఈ సినిమాపై ప్రేక్షకుల్లో ఆసక్తి నెలకొంది.

# పూజా కార్యక్రమాలతో ధనుష్ కొత్త సినిమా

**మధురై, మహా:** తమిళ స్టార్ హీరో ధనుష్ నటిస్తున్న కొత్త చిత్రం పూజా కార్యక్రమాలతో ఘనంగా ప్రారంభమైంది. 'D56' వర్కింగ్ టైటిల్‌తో తెరకెక్కుతున్న ఈ సినిమాకు 'లబ్బర్ పందు' ఫేమ్ తమిళరసన్ పచముత్తు దర్శకత్వం వహిస్తున్నారు. మధురైలోని మారనాడు కరుప్పణస్వామి ఆలయంలో నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమాలతో చిత్ర నిర్మాణాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ధనుష్‌తో పాటు దర్శకుడు, నిర్మాతలు, చిత్రబృందం పాల్గొన్నారు. ఈ సినిమాలో ధనుష్‌కు జోడీగా ప్రీతి ముకుందన్ నటించనున్నారు. ఎస్జే సూర్య, వడివేలు, విజయ్ కుమార్ తదితరులు కీలక పాత్రల్లో కనిపించనున్నట్లు సమాచారం. గ్రామీణ నేపథ్యంలో యాక్షన్, భావోద్వేగ అంశాలతో కథను రూపొందిస్తున్నట్లు తెలుస్తోంది. కథలోని పాత్రలకు అనుగుణంగా ధనుష్ లుక్ కూడా ప్రత్యేకంగా ఉండనున్నట్లు సినీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ఈ చిత్రానికి యువ సంగీత దర్శకుడు సాయి అభ్యంకర్ స్వరాలు సమకూర్చనున్నారు. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫైమార్క్ ప్రొడక్షన్స్ సంస్థలు సంయుక్తంగా సినిమాను నిర్మిస్తున్నాయి. పూజా కార్యక్రమాల సందర్భంగా ధనుష్‌ను చూసేందుకు అభిమానులు భారీగా తరలిరావడంతో మధురైలో సందడి నెలకొంది. సినిమా షూటింగ్ త్వరలోనే పూర్తి స్థాయిలో ప్రారంభం కానుంది. చిత్రానికి సంబంధించిన మరిన్ని వివరాలను మేకర్స్ త్వరలో అధికారికంగా వెల్లడించనున్నారు.



# ట్రోల్స్‌పైనా నాని స్పందన

**హైదరాబాద్, మహా:** నేచురల్ స్టార్ నాని హీరోగా శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో తెరకెక్కిన 'ది ప్యారడైజ్' చిత్రం సెప్టెంబర్ 24న ప్రేక్షకుల ముందుకు వచ్చింది. సినిమా విడుదల అనంతరం ప్రేక్షకులు, అభిమానులు, సినీ విమర్శకులు సోషల్ మీడియా వేదికగా తమ అభిప్రాయాలను పంచుకుంటున్నారు. కొందరు సినిమాను ప్రశంసిస్తుండగా, మరి కొందరు కొన్ని అంశాలపై విమర్శలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో నాని తాజాగా సోషల్ మీడియాలో స్పందించారు. సినిమాపై వచ్చిన స్పందనలను తాను గమనించానని నాని తెలిపారు. అభిమానులు చూపించిన ప్రేమ తనను ఎంతో ఆనందపరిచిందని చెప్పారు. అదే సమయంలో సోషల్ మీడియాలో వచ్చిన సరదా ట్రోల్స్‌ను కూడా తాను ఆస్వాదించానని పేర్కొన్నారు. ప్రేక్షకులు సినిమాను తమ సొంత చిత్రంగా భావించి స్పందించిన తీరు తనను హత్తుకుందని నాని అన్నారు. సినిమాలోని కొన్ని లోపాలను విమర్శకులు, రివ్యూవర్లు ప్రస్తావించడాన్ని కూడా తాము గమనించామని, వాటి నుంచి నేర్చుకునే అవకాశం లభించిందని ఆయన వెల్లడించారు. 'ది ప్యారడైజ్' కోసం చిత్రబృందం ఎంతో శ్రమించిందని, ప్రేక్షకులకు విభిన్నమైన అనుభూతిని అందించాలనే ఉద్దేశంతో పనిచేశామని తెలిపారు. సినిమా విడుదలకు ముందు తనపై, చిత్రంపై ప్రేక్షకులు చూపించిన ఆసక్తి, అభిమానానికి నాని కృతజ్ఞతలు చెప్పారు. ప్రస్తుతం ఆయన చేసిన ఈ స్పందన సోషల్ మీడియాలో చర్చనీయాంశంగా మారింది.



### డబ్బింగ్ మొదలుపెట్టిన

# చిరంజీవి 'కాకా'

హైదరాబాద్, మహా: మెగాస్టార్ చిరంజీవి, దర్శకుడు బాబీ కొల్లి కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న 'కాకా' సినిమా పనులు శరవేగంగా సాగుతున్నాయి. తాజాగా ఈ చిత్రానికి డబ్బింగ్ కార్యక్రమాలను ప్రారంభించినట్లు మేకర్స్ ప్రకటించారు. షూటింగ్‌తో పాటు పోస్ట్ ప్రొడక్షన్ పనులను కూడా వేగంగా పూర్తి చేస్తున్నట్లు తెలిపారు. 'కాకా' చిత్రాన్ని 2027 సంక్రాంతి కానుకగా జనవరి 13న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయనున్నట్లు చిత్రబృందం మరోసారి స్పష్టం చేసింది. గత కొంతకాలంగా సినిమా విడుదల తేదీపై పలు ఊహాగానాలు వచ్చిన నేపథ్యంలో తాజా డబ్బింగ్ అప్‌డేట్‌తో వాటికి తెరపడింది. చిరంజీవి, బాబీ గతంలో 'వాల్తేరు వీరయ్య' కోసం కలిసి పనిచేశారు. ఇప్పుడు మరోసారి వీరిద్దరి కాంబినేషన్‌లో 'కాకా' రూపొందుతోంది. యాక్షన్, మాస్ అంశాలతో తెరకెక్కుతున్న ఈ చిత్రంలో అనస్వర రాజన్, నివేతా పేతురాజ్, సునీల్ తదితరులు కీలక పాత్రల్లో కనిపించనున్నారు. థమన్ సంగీతం అందిస్తుండగా, కేవీఎన్ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై వెంకట్ నారాయణ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన టైటిల్ గ్లింప్స్‌కు ప్రేక్షకుల నుంచి స్పందన వచ్చింది. తాజా డబ్బింగ్ పనుల ప్రారంభంతో సినిమా నిర్మాణం తుది దశకు చేరుకుంటున్నట్లు తెలుస్తోంది. సంక్రాంతి విడుదలను లక్ష్యంగా చేసుకుని చిత్రబృందం పనులను కొనసాగిస్తోంది.




EDITOR, PRINTER,PUBLISHER AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, PRINTED AT 19-12-458, BAIRAGIPATTEDA, TIRUPATHI - 517501, A.P., REGD NO : APTEL/2014/58382. PH NO : 6300992296, Email : mahapathrika2003@gmail.com. PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. Corporate Office : 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana, IN - 500034